


# ప్రజాప్రశ్న

తెలుగు దినపత్రిక




సంపుటి: 4 సంచిక: 196, పేజీలు - 08

బుధవారం, నవంబర్ 27, 2024 వెల: 5 రూ/.

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati



## కవిత రెండో ఇన్నింగ్స్

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాజకీయాలు పూల బాట మాత్రమే కాదు. ముళ్ల బాట కూడా. అధికారంలోకి రావాలంటే చెమటోడ్చాల్సిందే. ఎత్తుకు పైఎత్తులు వేయాల్సిందే. వ్యూహానికి ప్రతి వ్యూహం పన్నాలి. ఎదురు దెబ్బ తగిలితే సమయం కోసం వేచి చూడాలి. గెలుపు కోసం ఎత్తు పల్లాలు దాటాలి, కష్టనష్టాలు అనుభవించాలి. చదరంగంలో పావులు కోల్పోయినంత మాత్రాన ఓటమి కాదు. పావులు ఉన్నంత మాత్రాన గెలుపు కాదు. చివరి వరకు ఎవరు పోరాటం చేస్తారో వారే విజేత. అందుకే రాజకీయాన్ని చందరంగంతో పోల్చి చెప్తారు పొలిటికల్ ఎక్స్ పర్ట్. ఇప్పుడు అదే రీతిలో ఎమ్మెల్సీ కవిత కెరీర్ రెండో ఇన్నింగ్స్ మొదలుపెట్టారా అన్న ప్రశ్న తలెత్తుతోంది.

**- ఉద్యమంలో కేసీఆర్ కుమార్తెగా**

తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ కుమార్తెగా కల్వకుంట్ల కవిత రాజకీయ రంగ ప్రవేశం చేశారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఆమె తనకంటూ ప్రత్యేక గుర్తింపు కోసం తెలంగాణ జాగృతి అనే సంస్థ ప్రారంభించారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలపై తెలంగాణ ప్రజల్లో ఓ చైతన్యం తీసుకురావడం ఆ సంస్థ ముఖ్య ఉద్దేశం. ఉద్యమంలో బతుకమ్మ పండుగను ఓ ఆయుధంగా కవిత వాడారు. మహిళల్లో పండుగ సంప్రదాయాలతోపాటు తెలంగాణ ఉద్యమ ఆకాంక్షపై నినదించేలా బతుకమ్మ పండుగను ఉపయోగించుకున్నారు. తద్వారా అప్పటి ఉద్యమ రాజకీయాల్లో తన ప్రత్యేకత చాటుకున్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు కవిత. అప్పటి టీఆర్ఎస్, అదే రీతిలో తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ ఇచ్చిన ఉద్యమ కార్యాచరణలో ముందున్నారు. అప్పటి ప్రభుత్వం పెట్టిన పలు ఉద్యమ కేసుల్లో నిందితురాలిగా ఉన్నారు. ఆ తర్వాత ఎంపీగా , ఎమ్మెల్సీగా పదవులు పొంది ప్రజా ప్రతినిధిగా పని చేశారు. కొన్ని కార్మిక సంఘాలకు గౌరవ అధ్యక్షురాలిగా పని చేసిన అనుభవం ఉంది. ఇలా తనదైన శైలిలో తెలంగాణ రాజకీయాల్లో కవిత చురుకుగా పాల్గొన్నారు.

**- రాజకీయ విమర్శలు**

రాజకీయాల్లో గుర్తింపు రావాలంటే దాని వెనుకే విమర్శలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. అదే రీతిలో కవితపైన విమర్శలు ఉన్నాయి. టీఆర్ఎస్‌లో కవిత కారణంగానే మరే ఇతర మహిళా నేతలకు గుర్తింపు రాలేదని, రాజకీయంగా ఎదగలేదన్న విమర్శలు ఉన్నాయి. సీనియర్లను కాదని ఎంపీగా, ఎమ్మెల్సీగా కుమార్తెకే కేసీఆర్ పదువులు ఇచ్చారన్న విమర్శలు వచ్చాయి. టీఆర్ఎస్ లేదా నేటి బీఆర్ఎస్ పార్టీ కుటుంబ పార్టీగా నేతలు, రాజకీయ విమర్శకులు చెబుతుంటారు. బీఆర్ఎస్ చీఫ్‌గా కేసీఆర్, ఆయన కుమారుడు కేటీఆర్, అల్లుడు హరీశ్ రావు, కుమార్తె కవిత, కేసీఆర్ కుటుంబ మరో సభ్యుడైన జోగినపల్లి సంతోష్ రాజకీయ పదవులు పొందారన్న విమర్శలున్నాయి. అయినా ఉద్యమంలో వీరంతా కీలక పాత్ర పోషించడం, ప్రజలతో మమేకమవ్వడం, ఉద్యమ కేసుల్లోను ఉండటంతో ఈ విమర్శలను ప్రజలు పట్టించుకోలేదు. కేసీఆర్ ఎక్కడ పోటీ చేసినా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. సిరిసిల్ల నుంచి కేటీఆర్ వరుసగా గెలిపిస్తూనే ఉన్నారు. సిద్దిపేట నుంచి హరీశ్ రావు గెలుపు పైన రికార్డులున్నాయి. కవిత ఎంపీగా రెండు సార్లు నిజామాబాద్ నుంచి పోటీ చేస్తే ఓసారి ఓటమి పాలయ్యారు. ఇది కవితకు రాజకీయంగా ఎదురు దెబ్బ అని చెప్పాలి. ఓటమి తర్వాత ఎమ్మెల్సీగా కవితకు పదవి కట్టబెట్టడం

2లో..

### ఢిల్లీలో బిజీబిజీగా

## సీఎం రేవంత్

**- తెలంగాణలో మరో 3 విమానాశ్రయాలు కావాలి**

**- కేంద్రాన్ని కోరిన సీఎం రేవంత్ రెడ్డి**



న్యూఢిల్లీ / హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో పారిశ్రామికాభివృద్ధి, ప్రజలకు రవాణా వసతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుకు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఢిల్లీలో కేంద్ర మంత్రిని సీఎం రేవంత్ మంగళవారం సాయంత్రం కలిశారు. తెలంగాణలో రెండో పెద్ద నగరమైన వరంగల్‌లో విమానాశ్రయ ఏర్పాటుకు అవసరమైన నిరభ్యంతర పత్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం జీఎంఆర్ నుంచి (ఒక విమానాశ్రయం నుంచి మరో విమానాశ్రయానికి 150 కి.మీ.దూరం ఉండాలనే నిబంధన) పొందిందని కేంద్రానికి రేవంత్ రెడ్డి తెలిపారు. 253 ఎకరాల భూ సేకరణకు అవసరమైన రూ.205 కోట్లను భారత విమానయాన సంస్థకి అందజేసిందని సీఎం వివరించారు. వరంగల్ విమానాశ్రయ పనులకు అవసరమైన అనుమతులు, అక్కడి నుంచి

2లో..



### రాహుల్ గాంధీకి బ్రిటన్

## పౌరసత్వం

**అంశాన్ని పరిశీలిస్తున్నామన్న కేంద్రం**

2లో..



### జీడిమెట్లలో భారీ అగ్ని ప్రమాదం

**- ఆ తప్పు వల్లే దట్టంగా మంటలు**

2లో..

## పిఠాపురానికి ఇక పండగే

**- ఢిల్లీ నుంచి శుభవార్తలు మోసుకొస్తున్న పవన్**



న్యూఢిల్లీ / అమరావతి (ప్రశ్న న్యూస్) ఢిల్లీ పర్యటనకు వెళ్లిన ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ హస్తినలో బిజీబిజీగా గడిపారు. కేంద్ర మంత్రులతో వరుసగా భేటీ అవుతూ రాష్ట్ర అంశాలపై చర్చించారు. ఈ క్రమంలోనే రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో పవన్ కళ్యాణ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఏపీలోని రైల్వే ప్రాజెక్టులపై చర్చించారు. అలాగే పిఠాపురం పరిధిలోని రైల్వే పనుల గురించి పవన్ కళ్యాణ్ కేంద్ర మంత్రికి పలు విజ్ఞప్తులు చేశారు. పిఠాపురం మున్సిపాలిటీ పరిధిలోని సామర్లకోట %-% ఉప్పాడ రోడ్డులో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఈ రోడ్డులో వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉన్న విషయాన్ని కేంద్ర మంత్రికి వివరించిన పవన్ కళ్యాణ్ నిరంతరంగా ఉండే ట్రాఫిక్ రద్దీని పరిష్కరించడానికి, రోడ్ కనెక్టివిటీని మెరుగుపరచడానికి రైల్వే ఓవర్ బ్రిడ్జి అవసరమని అన్నారు. ఈ ప్రాజెక్టును ప్రధానమంత్రి గతి శక్తి కార్యక్రమం ద్వారా మంజూరు చేయాలని కోరారు. అలాగే పిఠాపురంలోని శ్రీపాద

2లో..

## జగన్ కు అదానీ లంచం

**- వ్యవహారంపై ఏసీబీకి ఫిర్యాదు**



అదానీ గ్రూప్ సంస్థల అధినేత గౌతమ్ అదానీ, ఆయన కంపెనీ సహచరులపై అమెరికాలో కేసు నమోదు కావడం దేశవ్యాప్తంగా ఎంత సంచలనం సృష్టించిందో ఆంధ్రప్రదేశ్‌లో అంతకు మించి దుమారం రేగింది. ఎందుకంటే ఈ కేసుకు సంబంధించి భారీ ముడుపులు ఆంధ్రప్రదేశ్‌లోనే అందినట్లు యు.ఎస్ ప్రాసిక్యూషన్ ఆరోపించింది. దాదాపు 1750కోట్ల రూపాయల ముడుపులు ప్రభుత్వ పెద్దలకు ముట్టినట్లు ఆరోపణలు వచ్చాయి. అప్పటి సీఎం జగన్మోహనరెడ్డి ప్రోద్భలంతో అదానీ సంస్థకు లబ్ది చేకూరేలా ఒప్పందం కుదిరిందని, ఆ ఒప్పందాన్ని రద్దు చేసి విచారణ జరిపించాలని డిమాండ్లు మొదలయ్యాయి.

2లో..

## ఏపీలోనూ "హైటెక్ సిటీ" నిర్మాణం

**- నూతన ఐటీ పాలసీపై సీఎం చంద్రబాబు సమీక్ష**

- **2029 నాటికి 5లక్షల వర్క్‌స్టేషన్లు**
- **డీప్ టెక్నాలజీ బిల్డింగ్ కు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్న సీఎం**
- **భవిష్యత్ అంతా డీప్ టెక్నాలజీదేనని వెల్లడి**
- **సమీక్షకు హాజరైన ఐటీ మంత్రి నారా లోకేశ్**



అమరావతి (ప్రశ్న న్యూస్) హైదరాబాద్లోని హైటెక్ సిటీ తరహాలోనే అమరావతిలో డీప్ టెక్నాలజీ ఐకానిక్ భవనం నిర్మించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సీఎం అధికారులను సూచించారు. నేటి యువత భవిష్యత్ డీప్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ లాంటి టెక్నాలజీపైనే ఆధారపడి ఉంటుందని చంద్రబాబు చెప్పారు. హైదరాబాద్‌లో ఐటీని ప్రమోట్ చేసేందుకు హైటెక్ సిటీ నిర్మించామని, ప్రస్తుతం డీప్ టెక్నాలజీతో ఉత్పన్నమయ్యే అవకాశాలను అందిపుచ్చుకునే దిశగా డీప్ టెక్నాలజీ ఐకానిక్ భవనం ఉండాలని సీఎం అభిప్రాయం వ్యక్తం చేశారు. సచివాలయంలో ఐటీ శాఖపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఐటీ సంస్థలు, ఐటీ డెవలపర్లకు ఇవ్వాల్సిన ప్రోత్సాహంపైనా సీఎం చర్చించారు. 2029 కల్లా రాష్ట్రంలో 5 లక్షల వర్క్ స్టేషన్లు, 2034 కల్లా 10 లక్షల వర్క్ స్టేషన్లు ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. కో-వర్కింగ్ స్పేస్‌లు, కార్యాలయ సముదాయాల నిర్మాణానికి అవసరమైన భూములు సబ్సిడీపై లీజుకి ఇవ్వడం, సింగిల్ విండో విధానంలో మౌలిక వసతుల కల్పనకు అనుమతులు ఇవ్వడం, ఐటీ సంస్థలకు ఇండస్ట్రియల్ పవర్ టారిఫ్ కింద తీసుకురావడం వంటి అంశాలపై సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు.

2లో..

## ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలి

**- అధికారులకు సీఎం రేవంత్ కీలక ఆదేశాలు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా జోరుగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ నిర్వహిస్తుండగా రైతులంతా కల్లాల దగ్గరే ఉంటున్నారు. ఈ క్రమంలోనే సీఎం రేవంత్ రెడ్డి రైతులకు తీపికబురు వినిపించారు. పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి మంగళవారం (నవంబర్ 26న) రోజు జిల్లా కలెక్టర్లతో సీఎం రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు త్వరితగతిన పూర్తి చేయాలని రైతులకు ఇలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను, అధికారులను సీఎం

2లో..

### చిట్టినాయుడి చిప్

## దొబ్బినట్లుగా ఉంది




- **సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ తీవ్ర విమర్శలు**
- **సీఎం అవగాహనారాహిత్యంతో మాట్లాడితే ఎలా అని ప్రశ్న**
- **అదానీకి కేంద్రం ఇచ్చిన ప్రాజెక్టులను తమకు ఆపాదిస్తున్నారని ఆగ్రహం**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అదానీకి తాము కొన్ని ప్రాజెక్టులు కట్టబెట్టినట్లు ముఖ్యమంత్రి అవాస్తవాలు చెప్పారన్నారు. సీఎం అవగాహనారాహిత్యంతో మాట్లాడితే ఎలా? అని ప్రశ్నించారు. అదానీ కొన్ని ప్రతిపాదనలను తమ ముందుకు తీసుకువస్తే నాటి సీఎం కేసీఆర్ తిరస్కరించారన్నారు. అదానీకి తాము రెడ్ సిగ్నల్ చూపిస్తే రేవంత్ రెడ్డి మాత్రం రెడ్ కార్పెట్ వేస్తున్నారని ఆరోపించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రెస్ మీట్ అంతా నిరాశ, నిస్పృహతో కనిపించిందని

2లో..

## ఎటూ తేలని మహా సీఎం పంచాయతీ

**-ఏక్‌నాథ్ షిండే రాజీనామా, అసెంబ్లీ రద్దు**



ముంబై (ప్రశ్న న్యూస్) మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడి మూడు రోజులు గడుస్తోన్నప్పటికీ ఇంకా ముఖ్యమంత్రి ఎవరనేది తేలట్లేదు. ప్రస్తుత ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, ఉప ముఖ్యమంత్రులు దేవేంద్ర ఫడ్నవిస్, అజిత్ పవార్ హస్తినలో మకాం వేస్తోన్నారు. ఈ మూడు రోజుల్లో పలుమార్లు ఢిల్లీ పెద్దలతో సమావేశం అయ్యారు. వరుసగా రెండోసారి ఏక్‌నాథ్ షిండేకు ముఖ్యమంత్రిగా అవకాశం ఇవ్వాలంటూ శివసేన పట్టుబట్టి కూర్చుంది. సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి

## గెలిస్తే మంచివి, లేదా ట్యాంపరింగా.?

**- ఈవీఎంలు, పేపర్ బ్యాలెట్ పై సుప్రీం వ్యాఖ్యలు**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఏ ఎన్నికలు జరిగినా ఓడిపోయిన పార్టీలు, అభ్యర్థులు ఎలక్ట్రానికి ఓటింగ్ మెషీన్(ఈవీఎం)లపై ఆరోపణలు చేయడం సర్వసాధారణం అయిపోయింది. తాజాగా వెలువడిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఈవీఎంలు ట్యాంపర్ అయ్యాయని, ఏకంగా ఎంపీ సంజయ్ రౌత్ చేసిన ఆరోపణలు తీవ్ర విమర్శలకు తావిచ్చాయి. అంతేకాకుండా కాంగ్రెస్ పార్టీ కూడా అనేక సార్లు ఈవీఎంలు ట్యాంపర్ అయ్యాయని ఆరోపణలు గుప్పించింది. ఈ నేపథ్యంలోనే కోర్టుల్లో కేసులు కూడా నమోదయ్యాయి. అయితే ఎన్నికల్లో ఈవీఎంలు కాకుండా అంతకుముందు ఉపయోగించిన పేపర్

2లో..

# రాహుల్ గాంధీకి బ్రిటన్ పౌరసత్వం

**- అంశాన్ని పరిశీలిస్తున్నామన్న కేంద్రం**

**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా ఉన్న రాహుల్ గాంధీకి ద్వంద్వ పౌరసత్వం ఉందని కొందరు బీజేపీ నేతలు ఎప్పటి నుంచో ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా రాహుల్ గాంధీకి భారత పౌరసత్వంతోపాటు బ్రిటన్ పౌరసత్వం కూడా ఉందని పేర్కొంటున్నారు. భారత ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక వ్యక్తికి ఒకే దేశ పౌరసత్వం ఉండాలి. అయితే రాహుల్ గాంధీకి ఇటు భారత్‌తోపాటు, బ్రిటన్ పౌరసత్వం ఉందనే ఆరోపణలు పదే పదే వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే తాజాగా కేంద్ర ప్రభుత్వం కీలక వ్యాఖ్యలు చేసింది. రాహుల్ గాంధీ సిటిజన్‌షిప్ విషయంలో దాఖలైన పిటిషన్‌పై కోర్టు స్పందన కోరగా కేంద్రం ఆ అంశం పరిశీలనలో ఉందని తెలిపింది. రాహుల్ గాంధీ పౌరసత్వం అంశాన్ని పరిశీలిస్తున్నామని కేంద్ర ప్రభుత్వం తాజాగా వెల్లడించింది. రాహుల్ గాంధీ బ్రిటన్ పౌరుడు అని ఈ నేపథ్యంలోనే ఆయనకు ఉన్న భారత పౌరసత్వాన్ని రద్దు చేయాలంటూ లాయర్, బీజేపీ నేత విఘ్నేశ్ శిశిర్ అలహాబాద్ హైకోర్టులో ఈ పిటిషన్ దాఖలు చేశారు. అంతేకాకుండా రాహుల్ గాంధీ పౌరసత్వం అంశంపై సీబీఐ విచారణ కూడా జరిపించాలని ఆయన కోరారు. ఈ పిటిషన్‌పై స్పందన తెలియజేయాలంటూ అలహాబాద్ హైకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించగా తాజాగా కేంద్రం స్పందనను తెలిపింది. ఇక రాహుల్ గాంధీ బ్రిటన్ పౌరుడని బీజేపీ సీనియర్ నేత సుబ్రహ్మణ్య స్వామి చాలా కాలం నుంచి తీవ్ర ఆరోపణలు చేస్తునే ఉన్నారు. బ్రిటన్‌లో నమోదైన ఓ కంపెనీకి డైరెక్టర్, సెక్రటరీగా రాహుల్ గాంధీ ఉన్నారని చెబుతున్నారు. అంతే కాకుండా ఆ కంపెనీ వార్షిక రిపోర్ట్‌లో రాహుల్ గాంధీ తాను బ్రిటిష్ పౌరుడిని అని పేర్కొన్నట్లు సుబ్రహ్మణ్య స్వామి ఆరోపించారు. ఇదే విషయంపై 2019లో కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు ఆయన లేఖ రాశారు. ఇతర దేశాల్లో పౌరుడిగా ఉన్న వ్యక్తి భారతదేశ పౌరసత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకోవాల్సి ఉంటుందని ఆ లేఖలో సుబ్రహ్మణ్య స్వామి ప్రస్తావించారు. భారత పౌరసత్వం కలిగి ఉన్న వ్యక్తి మరో దేశ పౌరసత్వం కలిగి ఉంటే రాజ్యాంగంలోని ఆర్టికల్ 9 భారతీయ పౌరసత్వ చట్టం 1955ని ఉల్లంఘించడమే అవుతుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే రాహుల్ గాంధీ పౌరసత్వం వ్యవహారంలో తర్వాతి విచారణ డిసెంబర్ 19వ తేదీన జరగనుంది.

# జీడిమెట్లలో భారీ అగ్ని ప్రమాదం

**- ఆ తప్పు వల్లే దట్టంగా మంటలు**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** మేడ్చల్ జిల్లా జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని పారిశ్రామికవాడలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఎస్‌వీఎస్ ప్యాబ్ ప్లాస్ట్ ఇండస్ట్రీస్ పరిశ్రమలో విపరీతంగా మంటలు ఎగసిపడ్డాయి. దట్టమైన పొగలతో ఆ ప్రాంతం కమ్మేసింది. నవంబర్ 26 మధ్యాహ్నానికి ముందు ప్రమాదం జరగ్గా సాయంత్రానికి కూడా మంటలు ఆర్పేందుకు సిబ్బంది శ్రమిస్తూనే ఉన్నారు. 40 వాటర్ ట్యాంకర్లు, 7 ఆరు ఫైర్ ఇంజన్లలతో అగ్ని మాపక సిబ్బంది మంటలు ఆర్పుతున్నారు. ఈ అగ్ని ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. మేడ్చల్ జిల్లా జీడిమెట్లలో ప్లాస్టిక్ బ్యాగుల పరిశ్రమలో జరిగిన అగ్ని ప్రమాదంలో మంటలు అదుపులోకి రావడం లేదు. గత 7 గంటలుగా మంటలు పెరుగుతూనే ఉన్నాయి. ఫైర్ సిబ్బంది 7 ఫైరింజన్లు, 40 నీటి ట్యాంకర్లతో రంగంలోకి దిగినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. మూడు అంతస్తుల భవనంలో ఇప్పటికే రెండంస్తులు కాలిపోయాయి. ప్రమాదం వలన పరిశ్రమ భవనం కూలిపోయే స్థితికి వచ్చింది అని అధికారులు చెబుతున్నారు, కింది అంతస్తులో అధిక మొత్తంలో పాలిథిన్ సంచుల తయారీకి వాడే ముడి సరకును నిల్వ ఉంచారు.(

# ఏపీలోనూ “హైటెక్ సిటీ” నిర్మాణం

**- రూ.25 లక్షలు సీడ్ ఫండింగ్**

స్టార్టప్ పాలసీలో భాగంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళలకు రూ.25 లక్షల వరకూ సీడ్ ఫండింగ్ ఇచ్చేలా ప్రణాళికలు రూపొందించాలని చంద్రబాబు అధికారులకు సూచించారు. రాష్ట్రంలో ఇన్నోవేషన్, స్టార్టప్ ఎకోసిస్టమ్ అభివృద్ధి కోసం రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు అనుసంధానంగా 5 జోనల్ ఇన్నోవేషన్ హబ్‌ల ఏర్పాటుపై సీఎం పలు సూచనలు చేశారు. సెంట్రల్ ఆంధ్ర, రాయలసీమ, దక్షిణాంధ్ర, గోదావరి, ఉత్తరాంధ్ర ఇలా 5ప్రాంతాల్లో జోనల్ హబ్‌లకు కేంద్రంగా అమరావతిలో ‘రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్’ పనిచేయాలని చెప్పారు. నెలకు రాష్ట్రంలో ఎంతమందికి ఉద్యోగాలు కల్పించాలి అనే లక్ష్యంతో అధికారులు పని చేయాలని చంద్రబాబు అన్నారు. పాలసీ ప్రకటన అనంతరం జిల్లా కలెక్టర్లు కూడా వర్క్ స్టేషన్ల ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను గుర్తించాలన్నారు. సచివాలయ ఉద్యోగులతో రాష్ట్రవ్యాప్తంగా ఎంతమంది వర్క్ ఫ్రం హోం కింద పనిచేస్తున్నారో మదింపు చేయాలన్నారు. వర్క్ స్టేషన్లకు వచ్చి పని చేసుకునే వారికి భవిష్యత్ అవసరాలకు తగినట్టుగా నైపుణ్యాలను పెంపొందించాలన్నారు.

**- 3 కేటగిరీలకు రాయితీలు**

మరోవైపు ఐటీ సంస్థల కోసం మౌలిక వసతులు కల్పించే డెవలపర్లకు ఇచ్చే రాయితీలను ప్రభుత్వం 3 కేటగిరీలుగా విభజించింది. కో వర్కింగ్ స్పేస్‌లు, నైబర్‌హుడ్ వర్కింగ్ స్పేస్‌లు, ఐటీ క్యాంపస్‌లకు వాటి సీట్ల సామర్థ్యం, కార్యాలయం విస్తీర్ణానికి అనుగుణంగా సబ్సిడీలు ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. ?కో వర్కింగ్ స్పేస్‌కు సబ్సిడీ పొందాలంటే కనీసం 100 సీట్ల సామర్థ్యం కానీ, 10 వేల చదరపు అడుగుల కార్యాలయ సముదాయం ఉండాలని నిర్ణయించారు. ?నైబర్‌హుడ్ వర్కింగ్ స్పేస్‌కు పది సీట్ల సామర్థ్యం లేదా 1000 చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్ తప్పనిసరిగా పేర్కొన్నారు. ?ఐటీ క్యాంపస్‌కు వచ్చే సరికి 10 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో కంపెనీ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. రూ. 30 కోట్ల టర్నోవర్ కానీ కనీసం 100 మందికి ఉద్యోగాలు కల్పించే సంస్థలకు ప్రోత్సాహకాలు ఇచ్చేలా ప్రభుత్వం తుది ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

# ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలి

రేవంత్ రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, కోమటి రెడ్డి వెంకట రెడ్డి, కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడిన రేవంత్ రెడ్డి అన్ని అంశాల్లో తెలంగాణ నంబర్ వన్‌గా ఉందని గతంలో ఎప్పుడు లేని విధంగా ధాన్యం కొనుగోలు, చెల్లింపులు సక్రమంగా జరుగుతున్నాయని వివరించారు. సన్న, దొడ్డు రకాలను వేరువేరుగా సేకరించాలని ధాన్యం విక్రయించిన తర్వాత త్వరితగతిన రైతుల అకౌంట్లలో ధాన్యం డబ్బులు జమ చేయాలని, సన్న రకాలకు బోనస్ ఇవ్వాలని అధికారులను రేవంత్ రెడ్డి ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. ఉమ్మడి జిల్లాలకు కేటాయించిన ఇంఛార్జి మంత్రులు, ఇంఛార్జి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని ధాన్యం కొనుగోళ్ల తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని రేవంత్ రెడ్డి సూచించారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన నివేదికను ప్రతిరోజు సమర్పించాలని ఆదేశించారు. మిల్లులకు ధాన్యం తరలించేందుకు లారీల ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. సన్నరకం వడ్లు పండించిన రైతులకు బోనస్‌గా క్వింటాల్‌కు రూ.500 ఇవ్వడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని అదే విధంగా మిగతా రైతులకు కూడా వెంటనే డబ్బులు చెల్లించటం వల్ల వాళ్లు కూడా సంతోషం వ్యక్తం చేసినవారిమవుతామని అధికారులకు రేవంత్ రెడ్డి సూచించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసే విధంగా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని.. గిట్టుబాటు ధర కంటే మార్కెట్ ధర తక్కువగా ఉన్న ప్రతి సందర్భంలో అన్ని పంటలను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసేలా రైతులకు భరోసా కల్పించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో 66 లక్షల ఎకరాల్లో రైతులు ధాన్యం పండించారని ఇంకా 20 లక్షల ఎకరాల్లో పంట కోయాల్సి ఉందని వివరించారు. సరిహద్దు జిల్లాల్లో నుంచి బోనస్ కోసం ధాన్యం రాష్ట్రంలోకి వస్తుందిని అలాంటి ధాన్యంపట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులను సీఎం హెచ్చరించారు.అక్రమాలకు పాల్పడే మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను రేవంత్ రెడ్డి ఆదేశించారు.

కొనుగోలు కేంద్రాల వద్ద అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు, పథకాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై, రైతులకు అందిస్తున్న సౌకర్యాల గురించి ప్రజలకు చేరే విధంగా విస్తృత ప్రచారం చేయాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈనెల 30వ తేదీన మహబూబ్‌నగర్‌లో రైతు పండగను జరుపబోతున్నామన్న రేవంత్ రెడ్డి ఈ నేపథ్యంలోనే అక్కడ 28, 29, 30 తేదీల్లో వ్యవసాయ అనుబంధ రంగాల ఎగ్జిబిషన్ ఏర్పాటు, వ్యవసాయ రంగంలో ఆధునిక పద్ధతులు, యాంత్రీకరణ, ఆదర్శ రైతులతో రైతు అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఈనెల 30న జరిగే రైతు పండుగను కలెక్టర్లు అందరు సమన్వయం చేసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు.

# ఢిల్లీలో బిజీబిజీగా సీఎం రేవంత్

విమానాలు నడిపేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రిని రేవంత్ రెడ్డి కోరారు.

**- వరంగల్‌తో పాటు మరో 3 కొత్త ఎయిర్‌పోర్టులు ఏర్పాటుకు ప్రతిపాదన**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విమానాశ్రయ ఏర్పాటుకు గతంలో గుర్తించిన స్థలం అనువుగా లేదు. దానికి ప్రత్యామ్నాయంగా పాల్వంచలో 950 ఎకరాలు గుర్తించామని రామ్మోహన్ నాయుడుకు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఆ భూమి వివరాలు ఏఏఐ అందజేశామని, వెంటనే విమానాశ్రయ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలని కేంద్ర మంత్రిని కోరారు. పెద్దపల్లి జిల్లాలో గతంలో గుర్తించిన భూమి విమానాశ్రయ నిర్మాణానికి అనువుగా లేదని ఏఏఐ ప్రీ–ఫీజుబిలిటీ సర్వేలో తేలిందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు రేవంత్ రెడ్డి తెలిపారు. దానికి ప్రత్యామ్నాయంగా అంతర్గాంలో 591.24 ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిందని... అక్కడి విమానాశ్రయ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలని కోరారు.

**- భూమి ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమని స్పష్టత**

ఆదిలాబాద్‌లో భారత వైమానిక దళం ఆధ్వర్యంలో ఇప్పటికే 369.50 ఎకరాల భూమి ఉంది. పూర్తి స్థాయి కార్యకలాపాలకు అదనంగా 249.82 ఎకరాలు అవసరమని రామ్మోహన్ నాయుడుకు తెలంగాణ సీఎం తెలిపారు. అదనంగా అవసరమైన భూమి సేకరించి అప్పగించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని వివరించారు. గిరిజనులు ఎక్కువగా ఉంటే ఆదిలాబాద్ కు వెంటనే విమానాశ్రయం మంజూరు చేయాలని రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రులను సీఎం రేవంత్ రెడ్డి కలిసిన కార్యక్రమాల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఎంపీలు కె.రఘువీర్ రెడ్డి, ఎం.అనిల్ కుమార్ యాదవ్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఆర్.రఘురామిరెడ్డి, డాక్టర్ కడియం కావ్య తదితరులు పాల్గొన్నారు.

**- బాపూఘాట్ అభివృద్ధికి 222.27 ఎకరాలు బదిలీ చేయండి - రేవంత్ రెడ్డి**

బాపూ ఘాట్ అభివృద్ధికి రక్షణ శాఖ పరిధిలోని 222.27 ఎకరాల భూమిని తెలంగాణ ప్రభుత్వానికి బదిలీ చేయాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో ఈసా, మూసీ నదుల సంగమ స్థలంలోని భూమిని బదిలీ చేయాలని కేంద్రాన్ని రేవంత్ రెడ్డి కోరారు. మహాత్మా గాంధీ చితాభస్మాన్ని కలిపిన చోట ఏర్పాటు చేసిన బాపూ ఘాట్ ను ప్రపంచ స్థాయిలో గాంధీ తాత్వికతను చాటే కేంద్రంగా తీర్చిదిద్దాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించిందని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.ఢిల్లీలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ను తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం సాయంత్రం కలిశారు. బాపూ ఘాట్ వద్ద గాంధీ సిద్ధాంతాలను ప్రచారం చేసే నాలెడ్జ్ హబ్, ధ్యాన గ్రామం (మెడిటేషన్ విలేజ్), చేనేత ప్రచార కేంద్రం, ప్రజా వినోద స్థలాలు, ల్యాండ్ స్కేప్ ఘాట్లు, శాంతి విగ్రహం, మ్యూజియంలతో గాంధీ సరోవర్ ప్రాజెక్టును చేపట్టనున్నామని రాజ్‌నాథ్ సింగ్‌కు సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. ఇందుకోసం రక్షణ శాఖ భూమిని బదిలీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

# పిఠాపురానికి ఇక పండగే

వల్లభ స్వామి దేవాలయానికి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారని రైల్వే శాఖ మంత్రికి తెలిపిన పవన్ కళ్యాణ్.. భక్తులకు వీలుగా ఉండేలా నాలుగు ముఖ్యమైన రైళ్ళకు పిఠాపురం రైల్వే స్టేషన్‌లో హాల్ట్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. నాందేడ్ - సంబల్పూర్ నాగావళి ఎక్స్‌ప్రెస్, నాందేడ్ - విశాఖపట్నం సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం– సాయినగర్ షిర్డీ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం–న్యూఢిల్లీ ఏపీ ఎక్స్‌ప్రెస్‌లకు పిఠాపురంలో హాల్ట్ ఇవ్వాలని కోరారు. అలాగే మహారాష్ట్ర లాతూర్ నుంచి తిరుపతికి రైలు ఏర్పాటు చేయాలని కోరారు. పవన్ కళ్యాణ్ ప్రతిపాదనలపై కేంద్ర రైల్వే మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది.మరోవైపు ఢిల్లీ పర్యటనలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తోనూ పవన్ కళ్యాణ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంత రహదారుల అభివృద్ధికి రుణాల్లో వెసులుబాటు కావాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ రోడ్ల ప్రాజెక్ట్ కోసం ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ నుంచి తీసుకొన్న రుణానికి సంబంధించి ప్రాజెక్టును 2026 డిసెంబర్ 31 వరకు పొడిగించాలని పవన్ కళ్యాణ్ నిర్మలా సీతారామన్‌ను కోరారు. అలాగే రుణ ఒప్పందంలో పేర్కొన్న ప్రకారం రీయింబర్స్‌మెంట్ పద్ధతిలో కాకుండా ముందస్తు చెల్లింపు పద్ధతిలో కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రస్తుతం ఉన్న నిధుల కేటాయింపులోనూ మార్పులు చేయాలని కోరారు.

# జగన్ కు అదానీ లంచం

**- మాజీ సీఎం జగన్‌పై ఏసీబీకి ఫిర్యాదు**

అదానీ గ్రీన్ ఎనర్జీ సంస్థకు అనుచిత లబ్ది చేకూర్చినందుకు గాను మాజీ సీఎం జగన్ మోహనరెడ్డిపై అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి విచారణ జరిపించాలని ఏపీ డీజీపీ కార్యాలయంలో ఫిర్యాదు అందింది. సెంటర్ ఫర్ సివిల్ లిబర్టీ వ్యవస్థాపకుడు నలమోతు చక్రవర్తి మంగళవారం డీజీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అవినీతి నిరోధక చట్టం కింద మాజీ సీఎం జగన్‌తో పాటు, అప్పటి విద్యుత్ శాఖ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఇంధన శాఖ కార్యదర్శి శ్రీకాంత్, గౌతమ్ అదానీపై కేసులు నమోదు చేసి విచారణ చేపట్టాలన్నారు.

**- అవినీతిపై కీలక ఆధారాలున్నాయి.**

డిసెంబర్ 1,2021 న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సోలార్ ఎనర్జీ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా – ఎస్‌ఈసీఐ నుంచి 7వేల మెగావాట్ల సౌర విద్యుత్‌ను కిలోవాట్ 2.42 పైసలకు కొనేవిధంగా దీనిని మరో 7 పైసలు పెంచుకునేవిధంగా 25 ఏళ్లకు ఒప్పందం చేసుకుందని కానీ అదే సమయానికి గుజరాత్ లో 1.99పైసలకే యూనిట్ విద్యుత్‌ను కొంటున్నారని చక్రవర్తి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ సమయానికి ప్రజలపై భారం పడుతోందని మాత్రమే తాము అనుకున్నామని కానీ ఇటీవల గౌతం అదానీపై అమెరికాలోని న్యూయార్క్ డిస్ట్రిక్ట్ కోర్టులో అక్కడ సెక్యూరిటీ ఎక్స్చేంజెస్ కమిషన్ ఎస్‌ఈసీఐ చేసిన ఫిర్యాదుతో ఇందులో భారీ అవినీతి జరిగినట్లు బయటకు వచ్చిందని ఫిర్యాదులో తెలిపారు. అదానీ గ్రీన్ ఎనర్జీ ఛైర్మన్ గౌతం అదానీ ద్వారా అప్పటి ఏపీ ముఖ్యమంత్రి జగన్ మోహనరెడ్డికి 1750కోట్లు అందినట్లు స్పష్టంగా తెలుస్తోందన్నారు. ఎస్‌ఈసీఐ ద్వారా ఏపీకి అదానీ గ్రీన్ ఎనర్జీని అందించేందుకు ఈ డీల్ కుదిరినట్లు అమెరికా అధికారులు చెప్పారని గుర్తు చేశారు.

**- సీఎంకే ముడుపులు అందాయి**

ఎస్‌ఈసీఐ కోర్టుకు సమర్పించిన నివేదికలోని 54 వ పేరాను చక్రవర్తి కంప్లెయింట్ లో పొందుపరిచారు. దాని ప్రకారం “ ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్‌లోనే చూసుకుంటే సెకీ ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు 7000 మెగావాట్లు విద్యుత్ అందించేందుకు సంప్రదింపులు జరిపారు. ఇందుకోసం ఒక్కో మెగావాట్ కు 25లక్షల చొప్పున అందించేందుకు అంగీకరించామని యజుర్ (అదానీ యు.ఎస్ పార్టనర్) ప్రతినిధులకు అహ్మదాబాద్‌లో జరిగిన వ్యక్తిగత సమావేశం లోచెప్పారు. ఈ లెక్కన 7 వేల మెగావాట్లకు 1750కోట్లు (200మిలియన్ డాలర్లు) చెల్లించారు. ఇందులో సీఎంతో సహా ప్రభుత్వ అధికారులకు ముడుపులు అందాయి.” అని ఉంది.

**- విచారణ చేపట్టాలి**

గౌతం అదానీపై యు.ఎస్ లో నమోదైన కేసును అనుసరించి ఏపీలో ముడుపులు ముట్టినట్లు అర్థం అవుతోందన్నారు. అప్పటి విద్యుత్ శాఖ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి సైతం అర్ధరాత్రి హడావిడిగా ఒప్పందంపై తన సంతకాన్ని అడిగారని చెప్పారని ఆయనతో బలవంతంగా సంతకం తీసుకున్నారన్న విషయం కూడా తెలుస్తోందన్నారు. అదానీ గ్రీన్ ఎనర్జీ సంస్థకు లబ్ది చేకూరేలా అప్పటి సీఎం వ్యవరించి ప్రజలను మోసగించారని అందుకోసం జగన్ పై, అప్పటి మంత్రి బాలినేని, ఇంధన కార్యదర్శి శ్రీకాంత్, గౌతమ్ అదానీలపై కేసులు నమోదు చేసి విచారించాలని ఫిర్యాదులో కోరారు.

# చిట్టినాయుడి చిప్ దొబ్బినట్లుగా ఉంది

ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీతో తిట్లు పడిన తర్వాత వెనక్కి తగ్గాల్సి వస్తుందన్న బాధతో తనను కూడా ఇష్టమొచ్చినట్లు తిట్టాడన్నారు. రేవంత్ రెడ్డికి ఆయన అనుకున్న ముఖ్యమంత్రి పదవి వచ్చిందని, ఇక కావాల్సినంత దోపీడి జరుగుతోందన్నారు. అయినప్పటికీ తమను ఎందుకు తిడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. ఆయన మాట్లాడిన మాటలు విన్న తర్వాత చిట్టినాయుడి చిప్ దొబ్బినట్లుగా అనిపించిందన్నారు. జాతీయ ప్రాజెక్టులను తాము అదానీకి ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజలను తక్కువ అంచనా వేస్తూ వాళ్లను తప్పుదోవ పట్టించే ప్రయత్నంలో భాగంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి చెప్పిన మాటలను ఎవరూ విశ్వసించడం లేదన్నారు. రక్షణ శాఖ ఇచ్చిన ప్రాజెక్టులను తమకు ఆపాదిస్తున్నారని మరి రాజ్‌నాథ్ సింగ్ ఏం చేస్తున్నట్లు అని చురక అంటించారు. కేంద్రం ఇచ్చిన ప్రాజెక్టులను తాము ఇచ్చినట్లుగా చెప్పడం ఏమిటన్నారు. చిట్టినాయుడు ఓ మూరు?డు అని ఆయన ఎవరు చెప్పినా వినరని ఎద్దేవా చేశారు. తమ హయాంలో మైక్రోసాఫ్ట్ నుంచి పెట్టుబడులు తీసుకువచ్చామన్నారు. మైక్రోసాఫ్ట్ డేటా సెంటర్‌ను తాము తీసుకు వస్తే అదానీ డేటా సెంటర్ అని సీఎం చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. సబ్జెక్ట్ తెలియకుండా ఏది పడితే అది మాట్లాడితే తెలంగాణ గౌరవం తగ్గుతుందన్నారు. తానేదో అదానీని కలిశానని రేవంత్ రెడ్డి ఫొటో రిలీజ్ చేశారని, తాను దావోస్‌లో ఆయనను కలిశానని, సోషల్ మీడియాలో కూడా పోస్ట్ చేశానని గుర్తు చేశారు. కానీ రేవంత్ రెడ్డిలా ఇంటికి పిలిపించుకొని నాలుగు గంటలు రహస్యంగా మాట్లాడలేదని విమర్శించారు. రేవంత్ రెడ్డిలా కాళ్లు పట్టుకొనే పనులు తాము చేయలేదన్నారు. కొండారెడ్డిపల్లిలో రేవంత్ రెడ్డి గెలుపు కోసం పని చేసిన మాజీ సర్పంచ్ ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. రేవంత్ రెడ్డి ఓ శాడిస్ట్ సీఎం అని విమర్శించారు.

# గెలిస్తే మంచివి, లేదా ట్యాంపరింగా.?

బ్యాలెట్ పద్ధతిని తీసుకురావాలని దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు తీర్పు సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది. ఎన్నికల్లో తిరిగి బ్యాలెట్ పేపర్ ఓటింగ్ తీసుకురావాలంటూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ సహా పలువురు వేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాలపై జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ పీబీ వరాలేలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ జరిపింది. విదేశాల్లో ప్రస్తుతం కూడా బ్యాలెట్ పేపర్ విధానం అమలు చేస్తున్నారని.. అందుకే భారత్‌లో కూడా అదే విధానాన్ని తీసుకువస్తే బాగుంటుందని కేఏ పాల్ పేర్కొన్నారు. అంతేకాకుండా ఎన్నికల సందర్భంగా దేశంలో రూ.వేల కోట్లలో అవినీతి జరుగుతోందని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ నేపథ్యంలోనే ఈవీఎం విధానాన్ని రద్దు చేసి తిరిగి పేపర్ బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికల నిర్వహించేలా ఆదేశాలివ్వాలని తన పిటిషన్‌లో కేఏ పాల్ కోరారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం ఆయనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.
అంతేకాకుండా కేఏ పాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఒకవేళ మీరు గెలిస్తే ఈవీఎంలను ట్యాంపరింగ్ చేయలేదు అంటారు, కానీ ఓడిపోతే మాత్రం ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లు ట్యాంపర్ అయ్యాయి అంటారు. అసలు ఇక్కడ ఏం జరుగుతోంది. బ్యాలెట్ పేపర్ విధానాన్ని అనుసరించిన మాత్రాన అవినీతి ఆగిపోతుందని మీరు చెప్పగలరా అని పిటిషనర్ కేఏ పాల్‌ను సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఆ తర్వాత ఆయన వేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఇటీవల జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ నేతృత్వంలోని మహా వికాస్ ఆఘాడీ కూటమి ఘోర పరాజయం పాలైంది. అయితే శివసేన ఉద్ధవ్ ఠాక్రే వర్గానికి చెందిన రాజ్యసభ ఎంపీ సంజయ్ రౌత్ ఈవీఎంలపై సంచలన ఆరోపణలు చేశారు. మహారాష్ట్ర ఎన్నికల్లో ఈవీఎంలు ట్యాంపరింగ్ అయ్యాయని ఇది ప్రజా తీర్పు కాదని తీవ్ర వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ ఎన్నికల్లోనే కాకుండా లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు జరిగిన ప్రతీసారి ఈవీఎంలు ట్యాంపరింగ్ అయ్యాయనే ఆరోపణలు వెల్లువెత్తుతూనే ఉన్నాయి.

# ఎటూ తేలని మహా సీఎం పంచాయతీ

అవసరమైన సంఖ్యా బలం బీజేపీకి లేకపోవడాన్ని తనకు అనుకూలంగా మలచుకుంది. రెండో దఫా తమ పార్టీ అధినేతనే కొనసాగించాలంటూ డిమాండ్ చేస్తోంది. ఈ మేరకు షిండే వర్గ శివసేన మహిళా అధికార ప్రతినిధి శీతల్ మ్హాత్రే ఓ ప్రకటన సైతం జారీ చేశారు. మహారాష్ట్ర ఓటర్లు, పార్టీ క్యాడర్ మొత్తం కూడా షిండే నాయకత్వాన్ని కోరుకుంటోందని తేల్చి చెప్పారు. మహాయుటిలో గల ఇతర పార్టీల కంటే కూడా తమకే అత్యధిక ఓట్ల శాతం పోల్ కావడమే దీనికి నిదర్శనమని అంటోన్నారు. మొత్తం 288 నియోజకవర్గాలు ఉన్న మహారాష్ట్ర అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి కావాల్సిన మేజిక్ ఫిగర్ 145. దీన్ని అలవోకగా అందుకుంది మహాయుటి. ఈ కూటమి అభ్యర్థులు 230 నియోజకవర్గాల్లో ఘన విజయం సాధించారు. బీజేపీ 149 సీట్లల్లో పోటీ చేసి132 చోట్ల విజయం సాధించింది. షిండే వర్గం శివసేన 81 నియోజకవర్గాల్లో అభ్యర్థులను నిలబెట్టగా 57 మంది గెలుపొందారు. అజిత్ వర్గానికి చెందిన ఎన్సీపీ మొత్తం 59 స్థానాల్లో పోటీ చేయగా 41 సీట్లు ఈ పార్టీ ఖాతాలో పడ్డాయి. లోక్‌సభ ఎన్నికలతో పోల్చుకుంటే ఇప్పుడు ఈ మూడు పార్టీల ఓటుబ్యాంకు అమాంతం పెరిగింది. ఈ కూటమిలో ఏ ఒక్క పార్టీకి కూడా సొంతంగా ప్రభుత్వాన్ని నెలకొల్పడానికి అవసరమైన మేజిక్ ఫిగర్ దక్కకపోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ మూడు పార్టీలు ఖచ్చితంగా పరస్పరం సహకరించుకోగలిగితేనే వరుసగా రెండోసారి మహాయుటి అధికారంలోకి రాగలుగుతుంది. ఈ పరిణామాల మధ్య ఏక్‌నాథ్ షిండే సంచలన నిర్ణయం తీసుకున్నారు. తన పదవికి రాజీనామా చేశారు. కొద్దిసేపటి కిందటే షిండే, దేవేంద్ర ఫడ్నవిస్, అజిత్ పవార్ ముంబై కొలాబా ప్రాంతంలోని రాజ్‌భవన్‌కు చేరుకున్నారు. గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌తో భేటీ అయ్యారు. అనంతరం ఆయనకు తన రాజీనామా పత్రాన్ని అందజేశారు. ఈ రాజీనామాను గవర్నర్ తక్షణమే ఆమోదించారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యేంత వరకు ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగాలని ఏక్‌నాథ్ షిండేకు సూచించారు. షిండే రాజీనామాతో అసెంబ్లీ రద్దయినట్టయింది.

# కవిత రెండో ఇన్నింగ్స్

విమర్శలకు దారి తీసింది. ఇలా రాజకీయంగా అనేక విమర్శల నడుమే కవిత తనదైన రాజకీయం చేస్తూ వస్తూ ఉన్నారు.

**మద్యం కుంభకోణంలో కవిత:** ఉద్యమ రాజకీయాల్లో, అధికార రాజకీయాల్లో ఓ వెలుగు వెలిగిన కవిత ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఇరుక్కోవడం అతి పెద్ద కుదుపు. అప్పటి వరకు సాఫీగా సాగిన రాజకీయాలు ఒక్కసారి వ్యతిరేకంగా మారాయి. ఢిల్లీ మద్యం విధాన రూపకల్పనలో మడుపులు చేతులు మారాయని, ఇందులో ఢిల్లీ సీఎం కేజ్రీ వాల్, డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియాతోపాటు కవిత పాత్ర ఉందన్న ఆరోపణలు వచ్చాయి. దీనిపై సీబీఐ, ఈడీ దర్యాప్తు జరిపాయి. కవిత ఇంట్లో సోదాలు చేసిన అనంతరం 15 మార్చి 2024లో కవితను ఈడీ అరెస్టు చేసి తీహార్ జైలుకు పంపారు. ఆ తర్వాత ఇదే కేసులో 11 ఏప్రిల్ 2024లో కవితను సీబీఐ అరెస్టు చేసింది. ఈడీ, సీబీఐ కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటూ కవిత జైలు జీవితం గడిపారు. ఈ కేసుల్లో సుప్రింకోర్టు బైయిల్ ఇవ్వడంతో ఆగష్టు 27, 2024న విడుదలయ్యారు.

**జైలు జీవితం తర్వాత రాజకీయ అడుగులు :** జైలు నుంచి విడుదలైన కవితకు పార్టీ నేతలు, కార్యకర్తలు అపూర్వ సాగతం పలికారు. ఈసందర్భంగా మాట్లాడిన కవిత తనను అన్యాయంగా జైలుకు పంపారని, అందుకు వడ్డీతో సహా చెల్లిస్తానని శపథం చేశారు. 18ఏళ్లు రాజకీయాల్లో ఉన్నానని ఎలాంటి ఆరోపణలు లేవని, తాను కేసీఆర్ బిడ్డగా తప్పు చేసే వ్యక్తి కానని చెప్పుకొచ్చారు. ఆ తర్వాత పొలిటికల్‌గా సైలంట్ అయ్యారు. ప్రతీ బతుకమ్మ పండుగకు వార్తల్లో నిలిచే కవిత ఈ సారి బహిరంగంగా బతుకమ్మ వేడుకల్లో ఎక్కడా పాల్గొన లేదు. ఆనారోగ్యం కారణమన్న ప్రకటనను ఆమె కార్యాలయం విడుదల చేసింది. ఇప్పుడు మళ్లీ రాజకీయాల్లో రెండో ఇన్నింగ్స్ మొదలుపెట్టారు. ఆ దిశగానే కవిత అడుగులు వేస్తున్నారు. ప్రస్తుత రాజకీయాల్లో మాస్ ఎంట్రీ ఇచ్చే దిశగా వ్యూహాలు సిద్ధం చేస్తున్నట్లు ఆమె సన్నిహితులు చెబుతున్నారు.

**వేచి చూసిన సమయం వచ్చినట్లేనా.?:** జైలు జీవితం తర్వాత మౌనంగా ఉన్న కవిత ఎక్కడా ఎలాంటి రాజకీయ ప్రకటనలు చేయలేదు. ఏ కార్యక్రమంలోను పాల్గొనలేదు. రాజకీయాల్లో కీలక పాత్ర పోషించే సమయం కోసం వేచి చూసిన కవిత అందుకు తగ్గట్టుగా సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవలే అదానీపై అవినీతి ఆరోపణలు వార్తలు వచ్చిన వెంటనే ఎమ్మెల్సీ కవిత తన ఎక్స్ ఖాతా ద్వారా స్పందించారు. ఆడవారికో న్యాయం, అదానికో న్యాయమా అంటూ తన గళం విప్పారు. అవినీతి ఆరోపణల పేరుతో తనను అరెస్టు చేసి జైలులో పెట్టారు. ఇప్పుడు అదానిపై అవే ఆరోపణలు వస్తున్నాయి. అతన్నీ జైలులో పెడతారా పెట్టరా అన్న ప్రశ్నలు ప్రజల్లో రేకెత్తించేందుకు కవిత ప్రయత్నించారు. రాజకీయంగా తమ పార్టీ, తాను వ్యతిరేకం కాబట్టే జైలుకు పంపారని, అదానీ బీజేపీ పెద్దలకు సన్నిహితుడు కాబట్టి అతన్ని జైలులో పెట్టే పరిస్థితి ఉండదన్న తీరును తన కామెంట్స్ ద్వారా బయటపెట్టారు కవిత. ఒక్క మాటలో చెప్పాలంటే తనపై మద్యం కుంభకోణం ఆరోపణలు రాజకీయపరమైనవే తప్ప అందులో వాస్తవాలు లేదని చెప్పారు. ఈ కామెంట్స్ ద్వారా ప్రజల్లో తనపైన సానుభూతి పెంచే వ్యూహాన్ని అమలు చేశారు. ఇలా తన తొలి ప్రశ్న బీజేపీ సర్కార్ పెద్దలకు వేస్తూ, సైలెన్స్ తర్వాత తన పొలిటికల్ రీ ఎంట్రీ స్టార్ట్ చేశారు.

**బీసీ కార్డు ద్వారా ప్రజల్లోకి!:** పొలిటికల్ మైలేజ్ రావాలంటే ప్రతీ రాజకీయ నేతకు ఓ వ్యూహం ఉండాలి. ఆ వ్యూహానికి తగ్గ ప్రజల డిమాండ్ ఉండాలి. ఆ డిమాండ్‌కు నాయకత్వం వహించాలి. తద్వారా పొలిటికల్ లీడర్ షిప్ చేయలనుకునే వారికి సులువైన జర్నీగా మారుతుంది. ఇప్పుడు తన రీ ఎంట్రీ అదే రీతిలో కవిత ప్లాన్ చేసుకున్నట్లు అర్థం అవుతోంది. ప్రస్తుతం బీఆర్ఎస్ సీనియర్లు అంతా రేవంత్ సర్కార్ పాలన తీరును, ఇచ్చిన హామీల నెరవేర్పు వంటి అంశాలపై నిలదీస్తుంటే అవేవి మాట్లాడకుంటా తెలంగాణలోని బీసీ వర్గానికి సంబంధించన కుల గణనపై మాట్లాడారు. తన పొలిటికల్ రీ ఎంట్రీ అతి పెద్ద ఓటర్ వర్గం డిమాండ్లపై కవిత స్పందించారనే చెప్పాలి. బీసీ కులగణన జరుగుతున్న వేళలో కవిత, యునైటెడ్ ఫూలే ఫ్రంట్ అనే సంఘంతో కలిసి 35 పేజీలతో కూడిన బీసీల డిమాండ్ల పత్రాన్ని బీసీ కమిషన్ అధ్యక్షుడిని కలిసి అందజేశారు. ఈ చర్య ద్వారా బీసీల అటెన్షన్ తన వైపు తిప్పుకునే ప్రయత్నం చేశారు. గతంలోను అంబేద్కర్ విగ్రహాన్ని అసెంబ్లీలో పెట్టాలని డిమాండ్ చేయడం ద్వారా ఎస్సీ, ఎస్టీ వర్గాలను, మహిళా రిజర్వేషన్లపై కొన్ని కార్యక్రమాలు చేసి మహిళా వర్గాన్ని ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. తాజాగా బీసీలను తన వైపు చూసేలా కవిత తన రీఎంట్రీ పొలిటికల్ జర్నీ స్టార్ చేశారనే చెప్పాలి. అయితే ఇది ఎంత వరకు తీసుకెళతారు. ఎలాంటి కార్యాచరణ ఉంటుంది. అన్నది చూడాల్సి ఉంది.

**జైలు జీవితం తర్వాత రాజకీయ భవిష్యత్తు అత్యున్నతంగా ఉండనుందా.?:** మన భారత రాజకీయాలను చూస్తే, జాతీయ పార్టీల్లోను, ప్రాంతీయ పార్టీల్లో జైలుకు వెళ్లిన రాజకీయ నేతలు సక్సెస్ ఫుల్ పొలిటీషియన్ అయినట్లు తెలుస్తోంది. అవినీతి ఆరోపణలు ఎంతగా వచ్చినా జైలుకు వెళ్లి ఊచలు లెక్కపెట్టిన రాజకీయ నేతల లెక్క చూస్తే అతి స్వల్పం. రాజకీయాల్లో హత్యలుండవు, ఆత్మహత్యలే ఉంటాయన్న నానుడి మనకు తెలిసిందే. రాజకీయాల్లో అరెస్టులే ఉంటాయి తప్ప జైలుకెళ్లడాలు అరుదు. అలా వెళ్లారంటే పొలిటికల్ ఈక్వేషన్ కుదరనట్లే. జైలుకు పంపే సర్కార్‌కు, వెళ్లే వారికి మధ్య పొలిటికల్ అండర్ స్టాండింగ్ ఇంపార్టెంట్ అన్నది తెలిసిందే. అందుకే గత ప్రభుత్వాల హాయంలో జరిగిన కుంభకోణాలు, వాటి వెనుక ఉన్న పొలిటికల్ లీడర్స్ శాశ్వతంగా జైలుకు వెళ్లిన ఉదంతాలు తక్కువే.కాని జైలుకు వెళ్లి విడుదలైన వారు మాత్రం అత్యన్నత రాజకీయ స్థానాలను అలంకరించారనడంలో సందేహం లేదు.

తెలుగు రాష్ట్రంలోనే చూస్తే జగన్మోహన్ రెడ్డి జైలు జీవితం తర్వాతే సీఎం అయ్యారు. తెలంగాణలో జైలు జీవితం తర్వాతే రేవంత్ రెడ్డి సీఎం అయ్యారు. దేశంలో సీనియర్ పొలిటీషియన్ అయిన చంద్రబాబు నాయుడు జైలు జీవితం అనుభవించాక సీఎం కుర్చీలో మరో దఫా కూర్చున్నారు. జార?ండ్‌లో హైమంత్ సోరేన్ కూడా జైలు జీవితం తర్వాత జరిగిన ఎన్నికల్లో బంపర్ మెజార్టీతో గెలిచి సీఎం అవబోతున్నారు.ఇవన్నీ మన దేశ రాజకీయాల్లో మనం చూస్తోన్న ఉదంతాలు. ఇక ఐదున్నర నెలలు జైలులో గడిపిన కవిత తన రీఎంట్రీ పొలిటిక్స్‌ను ఎలా మలచుకోనున్నారు?, ఎలాంటి వ్యూహంతో ముందుకు వెళతారు ? రాజకీయంగా ఏ స్థాయికి చేరుకుంటారు ? అన్నది ఇప్పుడు అందరిలోను ఉత్పన్నమయ్యే ఆసక్తి కరమైన ప్రశ్న.

# మేడ్చల్ కు చేరుకున్న మాలల మహా పాదయాత్ర

మేడ్చల్(ప్రశ్న న్యూస్) కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ ప్రయత్నంతో మాల, మాదిగల మధ్య చిచ్చు పెట్టేందుకు చూస్తుందని జాతీయ మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా దళితుల ఐక్యత కోసం రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఆధ్వర్యంలో 1000 కిలోమీటర్ల పాదయాత్ర మంగళవారం మేడ్చల్ జిల్లాకు చేరుకుంది. ఎల్లంపేట గ్రామ శివారులో జిల్లాకు పాదయాత్రగా చేరుకున్న మాల మహానాడు నాయకులకు మంగళ హారతులతో స్వాగతం పలికారు .ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్,ఉపాధ్యక్షుడు బేరి ఈశ్వర్ మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణ అనే పేరుతో దళితులను విడగొట్టి దళితుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయని పిల్లి సుధాకర్ మండిపడ్డారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ ప్రయత్నాలని తక్షణమే విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. తెలుగు రాష్ట్రాలలో ఏ ఒక్కరు కూడా చేయని విధంగా మాల మహా పాదయాత్ర గత నెల 25వ తేదీన భద్రాచలంలో ప్రారంభమై 35 నియోజకవర్గాలు,16 జిల్లాల మీదుగా కొనసాగిందని తెలిపారు. మందకృష్ణ మాదిగ ప్రధాని మోడీ చేతిలో కీలుబొమ్మలాగా మారి దళితులను, మాలలను అవమాన పరుస్తున్నటువంటి తీరు సరికాదన్నారు. రాష్ట్రంలో మాలలు తక్కువ ఉన్నారని, మాలలు మాదిగలను దోచుకుంటున్నారని చెబుతూ చేస్తున్న ప్రచారం ఎవరు నమ్మకూడదని ఆయన చెప్పారు. డిసెంబర్ 1న హైదరాబాద్ జింఖానా గ్రౌండ్స్ జరగనున్న మాలల సింహ గర్జన కార్యక్రమాన్ని రాష్ట్రంలో ఉన్నటువంటి మాల కులస్తులు పాల్గొని విజయవంతం



చేయాల్సిందిగా పిల్లి సుధాకర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు ఉదండపురం సత్యనారాయణ, కౌన్సిలర్ బాలరాజు, నాగభూషణం, జాకట దేవ, బైరి సంజీవయ్య, దుడ్డు సంజీవ, కొలా వెంకటేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# 7 కోట్లతో ఖానాపూర్ నుంచి ఎల్ మడుగు డబల్ రోడ్డు నిర్మాణం.

**- రాష్ట్ర ఐటి, పరిశ్రమలు శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి.శ్రీధర్ బాబు**



మంథని ( ప్రశ్న న్యూస్) మంథని నియోజకవర్గం లోని20 లక్షలతో నాగారంలో హెల్త్ సబ్ సెంటర్ నిర్మాణ పనులకు శంకుస్థ మంథని మండలంలో గాక ఖానాపూర్ నుంచి ఎల్ మడుగు వరకు డబుల్ రోడ్డు నిర్మిస్తున్నామని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు శాసన సభ వ్యవహారాల శాఖా మంత్రి డి.శ్రీధర్ బాబు అన్నారు. మంగళవారం రాష్ట్ర ఐటి, పరిశ్రమలు తసన సభ వ్యవహారాల శాఖా మాత్యులు డి.శ్రీధర్ బాబు మంథని లో పలు అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా %శ్రీ%మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు అవసరమైన మూలిక వసతులు కల్పిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేశామని అన్నారు. మంథని పట్టణానికి త్వరలోనే బైపాస్ రోడ్డు ఏర్పాటు చేస్తామని అన్నారు. 7 కోట్లతో ఖానాపూర్ నుంచి ఎల్ మడుగు డబల్ రోడ్డు నిర్మాణం పనులు నిర్ణీత సమయంలో జరిగేలా అధికారుల చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం మంథని మండలంలోని నాగారం గ్రామంలో 20 లక్షల రూపాయలతో చేపట్టిన హెల్త్ సబ్ సెంటర్ నిర్మాణ పనులకు మంత్రి శ్రీధర్ బాబు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# పశువు పెంపకంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి

**మండల పశువైద్యాధికారి డా. వీరేశం**



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) అంసాన్ పల్లి గ్రామంలో పాడి రైతులు తమ పశువుల పెంపకం పోషణ లో తగు జాగ్రతలు తీసుకోవాలని కొల్చారం మండల పశువైద్యాదికారి డా వీరేశం . మంగళవారం నాడు జిల్లా పశుఘణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పశు సంవర్ధక శాఖ సహకారం తో అంసాన్ పల్లి గ్రామం లో నిర్వహించిన పశువైద్య శిభిరం లో అయన పాల్గొని పశువులకు గర్భస్త పరీక్షలు నిర్వహించి తగిన. మందులు అందజేశారు ఈ సందర్బంగా ఆ యన రైతులకు పశు పోషణ పై అవగాహనా కలిపిస్తూ పాడి పశువులు పెయ్యాలు సకాలంలో ఎదకు వచ్చేలా మరియు చుడి కట్టేలా చూడాలని అన్నారు. మరియు ప్రతీ పశువుకు వ్యాధి నిరోధక టీకాలు వేయించు కోవాలని దూడల పోషణ గురుంచి వివరించారు. ఈ సందర్బంగా శిభిరంలో 28 పశువులకు గర్భష్ఠ పరీక్షలు 8 పశువులకు సాధారణ చికిత్సలు.6 పశువులకు గార్భాదారణ టీకాలు.21 దూడలకు నట్టల నివారణ మందులు వేయడం జరిగింది. అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ శ్రీనివాస్ రెడ్డి వి ఏ గట్టయ్య వి. ఎల్ . ఓ వేణు మైపాల్ గోపాల మిత్రులు ప్రవీణ్ శ్రీకాంత్ మానయ్య దీపక్ పాడి రైతులు పాల్గొన్నారు

# మంథని ఎస్సీ బాలికల వసతి గృహం ఔట్సోర్సింగ్ వర్కర్ మల్లమ్మ ను విధుల నుండి తొలగించాలి.



మంథని ( ప్రశ్న న్యూస్) మంథని మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో విధులు నిర్వహిస్తున్న ఔట్సోర్సింగ్ వర్కర్ మల్లమ్మ పదో తరగతి అమ్మాయి కి మాయమాటలు చెప్పి నగ్నంగా పూజలు చేస్తే డబ్బులు వస్తాయని చెప్పి స్కూలు నుంచి వెళ్లి తన రూముకు నేరుగా తీసుకొని వెళ్లి మరొక వ్యక్తిని పిలిపించు వీడియో కాల్ మాట్లాడించి అమ్మాయిని భయభ్రాంతులకు గురి చేయడం జరిగింది. ఇట్టి విషయంపై తల్లిదండ్రులు విషయం తెలుసుకొని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగింది. దీనిపై వెంటనే స్పందించి మల్లమ్మ అనే ఔట్సోర్సింగ్ వర్కర్ ను విధుల నుండి తొలగించాలని డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్ స్వప్న మద్దతుగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్, కెవిపిఎస్ నాయకులు మంథని లింగయ్య, విద్యార్థి సంఘం నాయకులు కదారి సతీష్ తదితరులు పాల్గొన్నారు

# పాత్రికేయులా? ఎమ్మెల్సీ ఆశావాహుల ప్రచార అస్త్రాలా?

**విజయ్ కుమార్ నారమళ్ళ ఏడిజెఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**



మంథని ( ప్రశ్న న్యూస్) నిజాన్ని నిర్భయంగా చెప్పేవాడు జర్నలిస్ట్, ఏలాంటి ఒత్తిళ్లకు తలోగ్గని వాడు జర్నలిస్ట్, ఎలాంటి బెదిరింపులకు లొంగని సామాన్యుడు జర్నలిస్ట్, నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలను ప్రభుత్వానికి అధికారులకు తెలియజేసేవాడు జర్నలిస్ట్, కానీ కొంతమంది జర్నలిస్టులు స్వార్థానికి పనిచేస్తున్నట్టు ఉన్నారు, వారి వల్ల నిజాయితీగా పనిచేసే విలేకరులకి విలువ లేకుండా పోతుందనీ, ఈమధ్య పేపర్స్ యూట్యూబ్ ఛానల్స్ చూస్తూ ఉంటే, వీళ్ళు పాత్రికేయులా? ప్రచార రథసారధులా అన్నట్టుగా ఉంది, వార్తలు రాయడం తప్పు కాదు, అసత్యాలు రాయడం నేరం, కలం చేతిలో ఉందని, పేపర్ గుప్పిట్లో ఉందని ఇష్టమొచ్చినట్టుగా నిజాలు తెలుసుకోకుండా రాస్తున్న వార్తలు చూస్తా ఉంటే బాధిస్తుంది, ఎలాంటి సమాచారం లేకున్నా, ఒక యజమానికి టికెట్ ఖరారు అయిందని జోరుగా ప్రచారం చేస్తున్నారు, ఎన్నికలకు సమయం ఉన్నప్పటికీ, అప్పుడే కొంతమంది విలేకరులు గెలుపు ఓటములపైన కథనాలు ప్రచురిస్తున్నారు,ఒక యజమాని గెలవబోతున్నాడని వార్తలు రాయడం,హాస్యాస్పదం, నిజాలు తెలియకపోతే వార్తలు రాయకండి, కానీ అసత్యాలు రాయడం ద్వారా, ప్రజలను మోసం చేసినట్లే, పట్టబద్రులను తప్పు ద్రోవ పట్టించినట్లే అని విజయ్ అన్నారు, పాత్రికేయులు మారాలి, ఇష్టం వచ్చినట్లు వార్తలు రాయెుద్దని, వార్తలు రాయడం తప్పు కాదు, కనీ ఊహించి రాయడం, ఆధారాలు లేని కథనాలు, ఎలాంటి అవకాశాలు లేని, వ్యక్తిని గెలుస్తాడని చెప్పడం, వీలైతే నేరుగా పట్టభద్రులను కలిసి వాళ్ళ అభిప్రాయాలు తెలుసుకొని, నిజాలు ప్రచురించాలని, ఏ డి జె ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్ నారమళ్ళ రాష్ట్రం లోని పాత్రికేయులని కోరారు

# దాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేయాలి

**ధాన్యం తరలింపులో మిల్లర్ల అలసత్వాన్ని సహించం**

**ప్రభుత్వ పాఠశాల,కళాశాలలో విద్యార్థుకు,ప్రభుత్వ హాస్పిటల్లలో రోగులకు పౌష్టిక ఆహారాన్ని అందించాలి**

**జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) కొల్చారం మండలం పోతన శెట్టిపల్లి గ్రామంలోని ఐకెపి వారి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన అనంతరం మండల కేంద్రంలోని సత్యసాయి రైస్ మిల్ మరియు కేజీవీబీ పాఠశాలలో వంటగదిని ,వంటలను వండే వస్తువులను పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేసి,రైతులకు సత్వరమే వారి అకౌ%శీ%ట్లలో డబ్బులు జమ చేయాలన్నారు. రైతులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఉండాలని ఆదేశించారు.ధాన్యం తరలింపులో మిల్లర్ల అలసత్వాన్ని సహించమన్నారు.

ధాన్యం లోడింగ్ అన్లోడింగ్ లో ఇబ్బంది కలగకుండా ఉండేందుకు మిల్లర్లు సహకరించాలన్నారు.పౌష్టిక ఆహారాన్ని అందించాలిప్రభుత్వ పాఠశాల, కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు,ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మంచి నాణ్యమైన పౌష్టిక ఆహారాన్ని అందించాలన్నారు.విద్యార్థులకు ఎలాంటి లోటు పట్లు లేకుండా చూడాలన్నారు.వంట గది,వంట సామగ్రిని ఎపుడు శుభ్రంగా ఉంచాలని,కేజీవీబీ పాఠశాల సిబ్బందికి సుంచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి శ్రీరామ్, కొల్చారం ఎమ్మార్వో గఫర్ మియా , ఆర్ ఐ ప్రభాకర్ , తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ స్ఫూర్తిని అలవర్చుకోవాలి

**- డి. ఎల్. యన్. చారి**



నిజామాబాద్ (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ ప్రెస్ క్లబ్ హాల్ లో మంగళవారం 75వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలు, భారతీయ సంవిదాన్ ప్రచారక్ దళ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లు అర్పించి, భారత రాజ్యాంగ ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా డి. ఎల్. యన్. చారి మాట్లాడుతూ, మన రాజ్యాంగం ప్రతీ పౌరుడికి హక్కులతో పాటు బాధ్యతలు రూపొందించిందన్నారు. డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ ప్రపంచంలోని అనేక దేశాల్లో పర్యటించి రూపొందించిన రాజ్యాంగంలో కులమతాలకు అతీతంగా ప్రజలకు సమాన హక్కులను కల్పించారన్నారు. రాజ్యాంగం ప్రకారం దేశంలోని ప్రతి పౌరుడికి కుల, మత, వర్ణ, వర్గ, ప్రాంత, లింగ భేదాలు లేకుండా సమాన హక్కులు కల్పించబడ్డాయన్నారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగం కల్పించిన హక్కులను పొందడంతో పాటు తమ విధులను, బాధ్యతలను తెలుసుకొని దేశ అభివృద్ధి కి పాటుపడాలని అన్నారు.అంబేద్కర్ నేతృత్వంలో ఆరుగురు సభ్యులు ఎంతో శ్రమించి 2 సంవత్సరాల 11 నెలల 18 రోజులలో అతిపెద్ద రాజ్యాంగాన్ని రచించారని అన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులకు భంగం వాటిల్లితే పౌరులు కోర్టుల ద్వారా న్యాయం పొందవచ్చన్నారు. అందరూ స్వేచ్ఛగా జీవించగలుతున్నారంటే అది రాజ్యాంగం కల్పించిన వరమన్నారు. ఈ కార్యక్రమంలో ,చిలుక శ్రీనివాస్, బత్తుల రవి,జడే సంతోష్, యాదల నరేష్, అరవింద్ నాయక్, మీర్జాపురం రామకృష్ణ, కేతవాత్ రమేష్, ఆనంద్, రమేష్, పాండు, సురేష్, దీపిక, తులసి, అనిత, కమల, నాగమణి,విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధికే ప్రభుత్వం పెద్దపీట హెడ్లైన్స్





నిర్మల్(ప్రశ్న న్యూస్) నాగపూర్ లో ఘనంగా ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలు హెడ్లైన్స్. పెంబి మండలంలోని నాగపూర్ గ్రామంలో మంగళవారం రోజున ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి పాలనలో సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. అలాగే ఈ కార్యక్రమంలో ఖానాపూర్ నియోజవర్గ ఎమ్మెల్యే వెడమ్మా బొజ్జు పటేల్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయడమే ప్రభుత్వం లక్ష్యంగా భావిస్తుంది అన్నారు. అలాగే ఈ కార్యక్రమంలో మండల ప్రెసిడెంట్ స్వప్నిల్ రెడ్డి, మందపల్లి ప్రెసిడెంట్ అశోక రావు అదేవిధంగా నాగపూర్ గ్రామ సెక్రెటరీ అనూష కాంగ్రెస్ పార్టీ నాయకులు అరె గోపాల్, మాగని ఎల్లయ్య, బోసు బాలకృష్ణ, నర్ర ఎల్లయ్య, ఇసాక్ పోశెట్టి, బోసు వెంకటి రాములు గ్రామస్తులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ స్ఫూర్తితో కార్మిక రైతు ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడుదాం



మంథని ( ప్రశ్న న్యూస్) మంథని అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ గారి విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా లివ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్లి మాట్లాడుతూ కేంద్రంలో మూడవసారి అధికారానికి వచ్చిన బిజెపి సంకీర్ణ ప్రభుత్వం కార్మిక రైతు వ్యవసాయ కార్మిక ప్రజావ్యతిరేక పాల్పడుతున్నదని కార్పొరేట్ల ప్రయోజనం కోసం దేశ స్వాతంత్రాన్ని స్వాలంబనను తాకట్టు పెడుతుందని స్వదేశీ జపం చేస్తూ విదేశీ సంస్థలకు ఊడిగం చేస్తుందని విమర్శించారు రాజ్యాంగం అమల్లోకి వచ్చి 71 సంవత్సరాలు గడుస్తున్న దేశంలో పేదరికం పోలేదని అన్నారు. భారత రాజ్యాంగ స్ఫూర్తితో రైతు కార్మిక వ్యవసాయ కూలీల హక్కుల కోసం ఉద్యమిస్తామని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు లిఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్, గర్ల్స్ కన్వీనర్ స్వప్న, కేవీపీఎస్ నాయకుడు మంథని లింగయ్య, ఇరుగురాళ్ల ప్రసాద్, కదారి సంజయ్, దేవేందర్లి తదితరులు పాల్గొన్నారు

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేసిన నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) కొల్చారం మండల పరిధిలోని పైతర గ్రామానికి వెల్మకన్న పెద్ద బాలమ్మ మరియు పోతుల పోచమ్మ లకు ఖర్చుల నిమిత్తం కోసం మంగళవారం నాడు నర్సాపూర్ శాసనసభ్యురాలు వాకిటి సునీత లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను మెదక్ జిల్లా యూత్ ఐకాన్ రవితేజ రెడ్డి మరియు కొల్చారం బిఆర్ఎస్ పార్టీ యువత అధ్యక్షులు కోనాపూర్ సంతోష్ రావు ఆధ్వర్యంలో అందజేయడం జరిగింది ఈ సందర్భంగా నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పేద మధ్య తరగతి ప్రజల ఆరోగ్యానికి గురైన ఉన్నత వైద్యం పొందిన వెంటనే సీఎం రిలీఫ్ ఫండ్ ఆసుపత్రికి ఖర్చుల అందించడం జరిగిందన్నారు భవిష్యత్తులో సైతం మరింత మందికి సీఎం రిలీఫ్ ఫండ్ ను మరింత మందికి సహాయం చేస్తామని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అన్నారు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందుకున్న లబ్ధిదారులు ఆపద కాలంలో ఆదుకున్న తమకు ఆర్థిక సహాయం అందించినందుకు నర్సాపూర్ ఎమ్మెల్యే కు సునీత లక్ష్మారెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా యూత్ ఐకాన్ రవితేజ రెడ్డి , కొల్చారం మండలం బిఆర్ఎస్ పార్టీ యువజన అధ్యక్షులు కోనాపూర్ సంతోష్ రావు, తెలంగాణ ఉద్యమ నేత తుక్కాపూర్ ఆంజనేయులు, పైతర మాజీ సర్పంచ్ మురళి, తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ

**- రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగిస్తూ పాలన చేయాలని కేటీఆర్ సూచన**

**- లేదంటే ప్రజలు బుద్ధి చెబుతారని హెచ్చరిక**

**- దొడ్డిదారిన ఎమ్మెల్యేలను చేర్చుకున్నారని మండిపాటు**

**- తెలంగాణను పోలీసు రాజ్యంగా మార్చారని విమర్శలు**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికైనా నియంతృత్వ ధోరణి వదిలేయాలని ఆ లేఖలో సూచించారు. రాజ్యాంగస్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రజాస్వామ్య పాలన చేయాలన్నారు. లేదంటే తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి, రేవంత్ రెడ్డికి బుద్ధి చెప్పడం ఖాయమని హెచ్చరించారు. రాజ్యాంగ దినోత్సవం రోజున ఈ లేఖ ద్వారా మీ రాజ్యాంగ వ్యతిరేక పాలనను తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. పౌరుల హక్కులను కాలరాస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. మీ ప్రభుత్వం రాజ్యాంగ విలువలను, స్ఫూర్తిని పూర్తిగా ఉల్లంఘిస్తోందని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి పేర్కొన్నారు. కేసీఆర్‌పై ఉన్న వ్యతిరేకత కారణంగా రాష్ట్రంలోని అతిపెద్ద అంబేద్కర్ విగ్రహాన్ని ఒక్కసారైనా గౌరవించకపోవడం బాధ కలిగిస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రాజ్యాంగస్ఫూర్తికి విరుద్ధంగా దొడ్డిదారిన ఎమ్మెల్యేలను మీ పార్టీలో చేర్చుకున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నుంచి వచ్చిన ఎమ్మెల్యేలకు కూడా నామినేటెడ్ పదవులు ఇస్తున్నారని విమర్శించారు. ప్రాథమిక హక్కు అయిన ప్రసంగ స్వేచ్ఛను తొక్కిపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా ద్వారా ప్రశ్నించినా కేసులు పెడుతున్నారని, మీడియా ప్రతినిధులపై కూడా దాడులు, తప్పుడు కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. 11 నెలల కాంగ్రెస్ పాలనలో పోలీసుల వేధింపులు ఎన్నడూ లేనంతగా పెరిగాయని ఆ లేఖలో ఆరోపించారు. మీ పాలనలో తెలంగాణ ఒక పోలీస్ రాజ్యాంగా మారిపోయిందని ముఖ్యమంత్రిని ఉద్దేశించి రాసిన లేఖలో పేర్కొన్నారు. మీ కుటుంబ సభ్యులు రాజ్యాంగేతర శక్తిగా పాలనలో జోక్యం చేసుకుంటున్నారని ఆరోపించారు. మీ నిర్ణయాలతో మీ సోదరులు క్విడ్ ప్రోకో విధానంలో లబ్ధి పొందుతున్నారని ఆ లేఖలో కేటీఆర్ రాసుకొచ్చారు. హైడ్రా మరో రాజ్యాంగేతర శక్తి అని మండిపడ్డారు. మార్పు అనే నినాదంతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, కానీ ప్రజలు ఆ మార్పు ఏమిటో గుర్తించారన్నారు. మీ రాజ్యాంగ వ్యతిరేక, అసమర్థ



పాలనను అన్ని వర్గాలు వ్యతిరేకిస్తున్నాయన్నారు. ఈ రాజ్యాంగ దినోత్సవం రోజున, రాజ్యాంగ పరిపాలనను పునరుద్ధరించాలని ప్రజల తరఫున విజ్ఞప్తి చేస్తున్నానని కేటీఆర్ పేర్కొన్నారు. రాజ్యాంగం ప్రజలకిచ్చిన న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వానికి గౌరవం చూపించేలా రాజ్యాంగ హక్కులను, స్ఫూర్తిని కాపాడుతూ ప్రజలకు పరిపాలన అందించాలన్నారు. నియంతృత్వ విధానంతో రాజ్యాంగ వ్యతిరేక పాలన కొనసాగిస్తే ప్రజలు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

# కాళ్లకు రాయి కట్టి సముద్రంలో పడేసి..



**విశాఖపట్నం** విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో సినీ తరహాలో దారుణ హత్య జరిగింది. ఒక వ్యక్తి కాలికి బరువైన రాయి కట్టేసి సముద్రంలో పడేసి నిందితులు హత్య చేసారు. ఫిషింగ్ హార్బర్ లో జెట్టి నంబర్ 10 వద్ద సముద్రంలో తేలుతూ మృతదేహం కనిపించింది. మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో మృతదేహాన్ని పోలీసులు బయటకి తీసారు. వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 68వ ఎస్జిఎఫ్ జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపికైన మంథని జెకెఏ షోటోఖాన్ కరాటే క్రీడాకారులు



**మంథని** 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయ స్థాయి కరాటే పోటీలకు మంథని జెకెఏ షోటోఖాన్ కరాటే క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ నెల 23 నుండి 25 వరకు ఎన్టిపిసి,టివి గార్డెన్ లో నిర్వహించిన పెద్దపల్లి జిల్లా ఎస్ జి ఫ్ సెక్రటరీ కొమురోజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి 68వ స్కూల్ గేమ్స్ కరాటే సెలెక్షన్స్ నిర్వహించారు . ముఖ్య అతిథులుగా గోదావరిఖని ఏసిపి మడత రమేష్ , పెద్దపల్లి జిల్లా విద్యాశాఖ ఏఎంఓ షేక్ లు ప్రారంభించారు. మంథని జె కె ఏ షోటోకాన్ కరాటే ఇన్స్ట్రక్టర్ కొండ్ర నాగరాజు ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కరాటే పోటీలలో అండర్ 17 విభాగంలో బేరా ఆదిత్య తేజ (–40 కె.జి) గోల్డ్ మెడల్, పొట్ల శ్రావణ్ కుమార్ (–45 కె. జి ) గోల్డ్ మెడల్, రంగు శ్రీ చరణ్ (–62 కె. జి )గోల్డ్ మెడల్, తోట హాసిని ( – 40 కె. జి ) సిల్వర్ మెడల్స్ సాధించారు. డిసెంబర్ 9 నుండి 16 వరకు న్యూ ఢిల్లీ లో నిర్వహించే జాతీయ స్థాయి కరాటే సెలక్షన్స్ కి ఎంపికయ్యారు. గెలుపొందిన విద్యార్థులను ఏసిపి మడత రమేష్ , జె కే ఏ సౌత్ జోన్ ఇంచార్జి రాపోలు సుదర్శన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు నూకల బానయ్య, పెద్దపల్లి జిల్లా ఏస్ జి ఫ్ సెక్రెటరీ కొమురోజు శ్రీనివాస్, పిఈటి మాధురి, శంకర్ గౌడ్, పెద్దపల్లి జిల్లా పేట ప్రసిడెంట్ సురేందర్, పిడి లు శోభారాణి, మాధవి, లక్ష్మణ్, విజయ్, జావిద్, తిరుపతి, ప్రకాష్, ఖజాబీ, పెద్దపల్లి జిల్లా కరాటే మాస్టర్స్ అభినందించారు.

# మండల కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

**కుటుంబ సమగ్ర సర్వే 99% పూర్తయింది డాటా ఎంట్రీ లక్ష కుటుంబాలు దాటిందన్న జిల్లా కలెక్టర్.**

ధర్పల్లి (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల కేంద్రంలో సమగ్ర కుటుంబ సర్వే డాటా ఎంట్రీ ని ఎమ్మార్వో కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు,సమగ్ర కుటుంబ సర్వే ఇప్పటివరకు 99% సర్వే జరిగింది. దాన్ని ఎమినేటర్ల ద్వారా ఆయా మండలాల్లో డాటా ఎంట్రీ కొనసాగుతుంది. ఆ పనులు ఏ విధంగా సాగుతున్నాయని తెలుసుకోవడానికి ధర్పల్లి ఎమ్మార్వో కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. డాటా ఎంట్రీ ఆపరేటర్లను ఏ విధంగా చేస్తున్నారని ఒకవేళ ఆధార్ కార్డు తప్పుగా ఉంటే, లేదా పేరు తప్పుగా, నంబర్ తప్పుగా ఉంటే ఎంట్రీ అవుతుందా అని అడిగి తెలుసుకున్నారు.



అనంతరం ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం నీటి సౌకర్యం ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం నిర్వాహకుల వద్దకు వెళ్లి బియ్యము,పప్పులు తదితర వస్తువులు ఎక్కడ ఉంచుతున్నారని అడిగి తెలుసుకున్నారు. నీటి సౌకర్యం లేదని తెలిసి వెంటనే సౌకర్యం కల్పించాలని అక్కడే ఉన్నా అధికారులు ఆదేశించారు. మధ్యాహ్నం భోజనం పథకం



నిర్వాహకులపై ఒక కన్నేసి ఉంచాలని అక్కడి ఇన్చార్జిలకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాజేంద్ర కుమార్, ఎంపీడీవో బాలకృష్ణ, తాసిల్దార్ మాలతి,ఎంఈఓ రమేష్, ఎం ఏ ఓ వెంకటేష్, ఏఈపిఆర్ బాలాజీ, ఆర్ ఐ రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు క్రీడలకు కొంత కేటాయించాలి

**- మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్**


**హైదరాబాద్** సనత్ నగర్ వెల్ఫేర్ గ్రౌండ్ లో గుర్తింపు పొందిన పాఠశాలల విద్యార్థుల స్పోర్ట్స్ మీట్ ను సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు. మూడు రోజుల పాటు నిర్వహించే స్పోర్ట్స్ మీట్ కు వేలాదిమంది విద్యార్థులు హాజరయ్యారు. తలసాని మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల పట్ల కూడా విద్యార్థులు శ్రద్ధ చూపాలి. క్రీడలలో గెలుపు, ఓటములను ఒకే విధంగా స్వీకరించాలి. తల్లిదండ్రులు పిల్లలను క్రీడలు, సాంస్కృతిక రంగాలలోను ప్రోత్సహించాలని అన్నారు.

## మంత్రి కోమటిరెడ్డి ఛాంబర్‌లో రాజ్యాంగ దినోత్సవం

**హైదరాబాద్** మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఛాంబర్ లో ఘనంగా 75వ రాజ్యాంగ దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్ ఌ బీ ఉద్యోగులు, మంత్రి పేషీ సిబ్బంది పాల్గొన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రియంబుల్ ను చదివి వినిపించారు. అన్ని వర్గాల ప్రజలకు సమానమైన హక్కుల కల్పించడంలో మన రాజ్యాంగం కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి అన్నారు. ప్రపంచంలో అతిపెద్ద, అత్యున్నత ప్రజాస్వామ్య దేశంగా నిలవడంలో మన రాజ్యాంగానిది కీలకపాత్ర అని అన్నారు.

## సినీ హీరో శ్రీ తేజ్‌పై కూకట్పల్లి పిఎస్‌లో కేస్ నమోదు

**హైదరాబాద్** సినీ హీరో శ్రీ తేజ్ పై కూకట్పల్లి పి ఎస్ లో కేస్ నమోదు అయింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని ఒక యువతి ఫిర్యాదు చేసింది. శ్రీ తేజ్ పై కూకట్పల్లి లో గతంలోనూ కేస్ నమోదు అయింది. పెళ్లయిన మరో వివాహితతో అక్రమ సంబంధం నేపథ్యంలో కేసు నమోదు అయింది. ఒక బ్యాంక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ భార్యతో శ్రీతేజ్ వివాహేతర సంబంధం వుందని ఆరోపణ. అక్రమ సంబంధం విషయం తెలిసి గుండెపోటు తో ఆ బ్యాంక్ అధికారి మరణించాడు. ఆ ఘటన లోను శ్రీ తేజ్ పై మాదాపూర్ లో ఫిర్యాదు చేసారు. ప్రస్తుతం శ్రీ తేజ్ బడా సినిమాలలో నటిస్తున్నాడు. శ్రీ తేజ్ పై బీఎన్ఎస్ 69, 115(2),318(2) సెక్షన్ ల కింద పోలీసులు కేస్ నమోదు చేసారు.



# ప్రీలాంచ్ పేరుతో రూ.48 కోట్లు స్వాహా

**- వంచించిన దంపతుల అరెస్టు**





స్థిరాస్తి ప్రాజెక్టుల పేరుతో 200 మంది నుంచి రూ.48 కోట్లు కాజేసి మోసగించిన దంపతులను సైబరాబాద్ ఆర్థిక నేరాల పరిశోధన విభాగం(ఈవోడబ్ల్యూ) పోలీసులు అరెస్టు చేశారు. డీసీపీ(ఈవోడబ్ల్యూ) కె.ప్రసాద్ వివరాల ప్రకారం.. కూకట్‌పల్లికి చెందిన చక్క భాస్కర్, సుధారాణి దంపతులు ఛైర్మన్, ఎండీలుగా మెసర్స్ ఆర్ హోమ్స్ ఇన్‌ఫ్రా డెవెలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో స్థిరాస్తి సంస్థను స్థాపించి కూకట్‌పల్లి రాజునగర్‌లో కార్యాలయాన్ని ప్రారంభించారు. ఆ సంస్థ ద్వారా వివిధ ప్రాంతాల్లో ప్రాజెక్టులను చేపడుతున్నట్లు ప్రకటనలు గుప్పించి డబ్బులు కాజేయాలని పథకం వేశారు.

**ప్రకటనలు గుప్పించి.. నిండా ముంచి..**

పథకంలో భాగంగా దంపతులు తమ సంస్థ ద్వారా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో బ్లిస్ హైట్స్ ప్రాజెక్టు, సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం కర్దనూర్‌లో ఓఆర్ఆర్ హైట్స్ ప్రాజెక్టు, సంగారెడ్డిలోనే నాగల్‌గిద్ద మండలం కారాముంగి గ్రామంలో ఫార్మ్ ల్యాండ్ ప్రాజెక్టులు ప్రీలాంచ్ చేస్తున్నామని, అధికారికంగా అన్ని అనుమతులు తీసుకున్నామని, మార్కెట్ కన్నా తక్కువ ధరకే ఫ్లాట్‌లను విక్రయిస్తున్నామని సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం చేశారు. మూడేళ్లలో ఫ్లాట్లను అప్పగిస్తామని నమ్మబలికారు. లేనిపక్షంలో డబుల్‌బెడ్‌రూం ఫ్లాట్‌కు నెలకు రూ.6వేలు, ట్రిపుల్ బెడ్ ఫ్లాట్‌కు రూ.8వేల చొప్పున అద్దె చెల్లిస్తామని నమ్మించి 200 మంది నుంచి రూ.48 కోట్లు వసూలుచేశారు. మూడేళ్ల గడువు దాటినా ప్రాజెక్టు పూర్తి చేయలేదు. పురోగతిపై బాధితులు అడుగుతుండటంతో కొంత కాలం కిందట కనిపించకుండా పోయారు. కూకట్‌పల్లికి చెందిన బాధితుడు మనోజ్ కుమార్ ఈవోడబ్ల్యూ పోలీసులను ఆశ్రయించారు. వారు దర్యాప్తు చేపట్టి సోమవారం దంపతులను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు.

# కార్తీక మాసం - కైవల్య ధామం

## "ఆధ్యాత్మిక శోభ సంతరించుకున్న కోటి దీపోత్సవం"

**న కార్తీక సమో మాసో**
**న శాస్త్రం నిగమాత్పరం !**
**నారోగ్య సమముత్సాహం**
**న దేవః కేశవాత్పరః !!**

"కార్తీకంతో సమానమైన మాసంకానీ, వేదంకంటే అన్యమైన శాస్త్రం కానీ, ఆరోగ్యంతో సమానమైన ఉత్సాహం కానీ, కేశవునికంటే అన్యమైన దైవంగానీ లేవని భావం"

ఈ కార్తీక మాసంలో ప్రతిరోజు పుణ్యప్రదమే. ఒక్కో రోజుకు ఒక్కో రకమైన విశిష్టత ఉంటుంది. స్కాంద పురాణంలో కార్తీక మాస విశిష్టత ప్రత్యేకంగా చెప్పబడింది. పూర్వ కాలంలో నారద మహర్షి భూలోకంపై మిక్కిలి వాత్సల్యం కలిగి బ్రహ్మను స్తుతిస్తు సంవత్సరంలో ఏ మాసం ఉత్తమమైనది, ఆ మాసంలో పూజింపవలసిన దైవం ఎవరు, దర్శించవలసిన ఉత్తమ తీర్థం





ఏదో చెప్పమని కోరాడు. అప్పుడు బ్రహ్మదేవుడు నారద మహర్షిని ఉద్దేశించి 12 మాసాలలో అత్యంత విశిష్టమైది కార్తీక మాసం మని ఈ మాసంలో పూజించ వలసిన దైవాలు శివకేశవులు. శివకేశవుల ఇద్దరికి ఈ మాసం ఎంతో ప్రీతీ పాత్రమైనదని ఈ మాసంలో దర్శించ వలసిన తీర్థం బదరీ క్షేత్రమని వివరించాడు.

### కార్తీక మాసంలో దీపారాధన ప్రాముఖ్యత

పరమేశ్వరునికి కార్తీక మాసం అంటే ఎంతో ప్రీతికరమైనది. ఈ కార్తీక మాసంలో సూర్యుడు తులా సంక్రమణలో ప్రవేశించగానే గంగానది ద్రవరూపం ధరించి సమస్త నదీజలాల యందు చేరుతుంది. ఈ జలాశయాలలో విష్ణువు వ్యాపించి ఉండడంతో కార్తీకస్నానం చేసినవారికి పుణ్యప్రదం. హాపీకూప, నదీస్నాన, జపాదులను ఆచరించేవారు అక్షయమైన అశ్వమేధ ఫలాన్ని పొందుతారని విశ్వాసం.

స్త్రీలుగాని, పురుషులుగాని కార్తీకమాసంలో తప్పనిసరిగా ప్రాతఃకాల స్నానం ఆచరించి కార్తీకమాసం సాయంకాలం శివాలయాలలో గానీ, వైష్ణవ ఆలయాలల్లో గానీ దీపారాధన చేయడం వలన అనంతమైన ఫలం లభించడమే గాక, శివాలయగోపుర ద్వార, శిఖరాల యందుగానీ, శివలింగ సన్నిధిలో గానీ దీపారాధన చేయడం వలన అన్ని పాపాలు అంతరించి పోతాయి. కార్తీకమాస మందు శివాలయంలో ఆవు నేతితోకాని, నువ్వుల నూనెతో కాని, ఆముదంతో కానీ దీపారాధన ఎవరు చేస్తారో, వారు అత్యంత పుణ్యవంతులవుతారని, నెల పొడవున చేసినవాళ్లు జ్ఞానులై, మోక్షాన్ని పొందుతారని ఇతిహాసాలలో చెప్పబడింది. పూర్వ జన్మార్జితాలైన పాపాలన్నీ కూడా కార్తీక వ్రతం వలన హరించుకుపోతాయని భక్తుల విశ్వాసం. కార్తీక మాసంలో వచ్చే ప్రతి సోమవారం నాడు పగలు ఉపవాస దీక్ష చేపట్టి, రాత్రి నక్షత్ర దర్శనానంతరం భోజనం చేస్తు ఆ రోజంతా భగవంతుని ధ్యానంలో గడిపేవాళ్లు తప్పక శివ సాయుజ్యాన్ని పొందుతారని భక్తుల విశ్వాసం.



### కన్నుల పండగగా కోటి దీపోత్సవం.

హైదరాబాద్ నగరంలో ఇందిరా పార్క్ సమీపంలో ఉన్న ఎన్టీఆర్ స్టేడియంలో ప్రముఖ మీడియా అధినేత తుమ్మల నరేంద్ర చౌదరి, రమాదేవి దంపతులు ప్రతి ఏడాది కోటి దీపోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సంప్రదాయ బద్ధంగా పూజలు, కల్యాణాలు, ఊరేగింపుల్లో ఎవరికి ఏలోటు లేకుండా దిగ్విజయంగా సాగుతుంది. కోటి దీపోత్సవం ముగింపు రోజుననే వచ్చే కోటి దీపోత్సవానికి ప్రణాళిక రూపుదిద్దుకోవడం ప్రత్యేకం. కోటి దీపోత్సవం చాలా ఖర్చుతో కూడుకున్న కార్యక్రమం. కాగా ఈ కార్యక్రమంలోపూజలన్నీ శాస్త్రోక్తంగా జరగడం విశేషం. కోటి దీపోత్సవ ప్రాంగణంలో జరగని పూజలేదు, నిర్వహించని కల్యాణం లేదంటే అతిశయోక్తి కాదు. వేదికపై ప్రత్యేక పూజలు జరుగడమేకాక భక్తులే పూజలను నిర్వహించుకునే ఏర్పాటు చేసారు. ప్రతిరోజు స్వామివార్ల కల్యాణాలు నిర్వహిస్తుండగా, ప్రసిద్ధిచెందిన అన్ని దేవాలయాల నుంచి దేవుళ్లంతా తరలివచ్చారు. సహస్ర కలశాభిషేకాలు, కోటి మల్లెల అర్చనలు, సుమంగళీ పూజలు, గణపతికి గరిక అర్చన, శివలింగాలకు భస్మార్చన, పార్థివ లింగానికి భస్మార్చన, అమ్మవారికి కోటి గాజుల అర్చన, తులసి దళార్చన, కోటి బిల్వార్చన, నాగ ప్రతిమలకు రాహుకేతు పూజలు, సత్యనారాయణ స్వామి వ్రతం, కోటి కుంకుమార్చనలు, రుద్రాక్షల అర్చన, ముడుపుల పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ ప్రత్యేక కార్యక్రమాలలో భక్తులు కోరుకున్న అన్ని పూజల్లో పాలుపంచుకుంటు కీసర శ్రీ రామలిగేశ్వర స్వామి, యాధగిరి గుట్ట శ్రీ లక్ష్మీనరసింహ్మ స్వామి కళ్యాణాలను భక్తి శ్రద్దలతో వీక్షించారు.

# కూచిపూడి నృత్యంలో అత్యంత ప్రతిభ
# కనబరిచిన మంథని చిన్నారి వైదిక

## – చిన్నారి వైదిక ను అభినందిస్తున్న పలువురు

**మంథని** మంథని వాస్తవ్యులు, హైదరాబాద్ పట్టణంలోని మణికొండలో నివాసం ఉంటున్న సముద్రాల శ్రీధర్–శ్యామల కూతురు చిన్నారి వైదిక హైదరాబాద్ నగరంలోని రవీంద్రభారతిలో నిర్వహించినటువంటి కూచిపూడి నృత్య కల ప్రదర్శనలో అద్భుతమైన ప్రతిభను కనబరిచి పలు అవార్డులను సొంతం చేసుకోవడం జరిగింది. శ్రీ రాజరాజేశ్వర భారత కళాసేవ సమితి,కీర్తి అకాడమీ అత్యంత ప్రతిష్టాత్మకంగా కార్తీకమాస సంగీత నృత్య మహోత్సవం 2024 ను కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు.మన ప్రాచీన కలలు కనుమరుగైపోతున్న రోజుల్లో చిన్నారి తల్లిదండ్రులు వైవిధ్యంగా ఆలోచించి కూచిపూడి నాట్యం పై మక్కువతో దృష్టి ఆకాడమీ కూచిపూడి నిర్వాహకులు ఉపాధ్యాయురాలు చల్ల బిందు శ్రీ ప్రేరణతో కూచిపూడి నాట్యంలో మంచి శిక్షణ అందించి తమ పాపను ఈ కలలో ప్రోత్సహించిందని చిన్నారి తల్లిదండ్రులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసినటువంటి మేధావులు,రాజకీయ ప్రముఖులు సముద్రాల వేణు గోపాలచారి,మాజీ మంత్రి చింతపట్ల వెంకటాచారి ఈ కూచిపూడి నృత్య ప్రదర్శనలో అత్యంత అద్భుత ప్రతిభ కనబరిచిన చిన్నారులకి అవార్డులు ప్రధానం చేసి సత్కరించారు. కూచిపూడి డాన్స్ అకాడమీ లో శిక్షణ తీసుకున్న చిన్నారి వైదిక అద్భుతమైన కళా ప్రదర్శన కనబరిచి అత్యంత ప్రతిభ పురస్కార అవార్డులు అయినటువంటి స్వర్ణ,నంది కార్తిక శివ,నాట్య కళా మంజీరా అవార్డు సాధించడంతోపాటు,ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్,తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ లో చిన్నారి చోటు సంపాదించింది. ఈ అవార్డు పొందడం పట్ల చిన్నారి తల్లిదండ్రులు,కుటుంబ సభ్యులు,దృష్టి అకాడమీ నిర్వాహకులు లతోపాటు పలువురు ఆనందం వ్యక్తం చేస్తూ అభినందించారు.





# మంథని హాస్టల్‌లో నగ్న పూజల కలకలం

**మంథని** మంథని బాలికల వసతీ గృహంలో నగ్న పూజల ప్రయత్నం కలకలం రేపింది. మహిళా వంట మనిషి హాస్టల్లో ఉంటున్న ఓ బాలికకు డబ్బు ఆశ చూపి నగ్న పూజలకు ప్రయత్నం చేసింది. బాలిక భయంతో హాస్టల్ నుంచి తప్పించుకుని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చింది. దాంతో బాలిక బంధువులు, తల్లిదండ్రులు హాస్టల్ కు చేరుకోని వంట మనిషిని నిలదీసారు. వాగ్వివాదంతో హాస్టల్ వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పోలీసుల జోక్యంతో అందోళన సద్దుమణిగింది. ఆడపిల్లలను ప్రలోభ పెట్టే మహిళపై కేసు నమోదు చేసారు. ఆమెను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

# అన్నం అధ్వాన్నంగా వుందని విద్యార్థుల అందోళన

**కరీంనగర్** కరీంనగర్ ఓల్డ్ హైస్కూల్ లో నాణ్యతలేని మధ్యాహ్న భోజనం పెట్టడం బయటపడింది. మాడిపోయి, మెత్తగా మద్దైన అన్నం పెట్టడంతో విద్యార్థుల డస్ట్ బిన్ లో పడేసి ఆందోళనకు దిగారు. మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని విద్యార్థులు ఆరోపించారు. గడక లాంటి అన్నం, నీళ్ల చారు పెడుతున్నారని అన్నారు. పిల్లలకు పెట్టే భోజనం కుక్కలు కూడా తినవని పేరెంట్స్ ఆందోళనకు దిగారు. కొత్త బియ్యం కావడంతోనే అన్నంగడ్డలా అయి మాడిపోతుందని హెడ్ మాస్టర్ అంటున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్ళి బియ్యం చేంజ్ చేస్తామని వెల్లడించిన హెడ్మాస్టర్ వెల్లడించారు.

# వామపక్షాల అందోళన




**కరీంనగర్** కరీంనగర్ లో కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ వామపక్ష కార్మిక సంఘాలు ఆందోళనకు దిగాయి. కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధానికి యత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులకు వామపక్ష పార్టీల నాయకులకు మధ్య తోపులాట జరిగింది. దిష్టిబొమ్మ చినిగిపోయింది. దాంతో పోలీసుల తీరుపై వామపక్ష పార్టీల నేతలు మండిపడ్డారు. కార్మికుల రైతుల హక్కుల సాధన కోసం ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని . వామపక్ష పార్టీల నేతలు అన్నారు

# వైద్య ఖర్చులకు సాయం అందించిన
# వీ హెచ్ ఆర్ ఫౌండేషన్





**కమాన్ పూర్** సమీర్ అనే యువకునికి పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని సహాయాన్ని వి హెచ్ ఆర్ వారు అందించారు. రామగుండం నియోజకవర్గం 27 వ డివిజన్ గాంధీనగర్ కి చెందిన, సమీర్ రహమతుల్లా(18) అనే యువకుడు కుటుంబ పరిస్థితుల దృశ్య చదువును మధ్యలోనే ఆపేసి చిన్న చిన్న పనులు చేసుకుంటూ, క్యాటరింగ్ సర్వీసులో పనిచేస్తు కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు, అయితే ఇటీవల తన పనికి వెళ్లి విధులు ముగించుకొని తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో రోడ్డు ప్రమాదానికి గురై ప్రాణాపాయ స్థితిలో స్థానిక కరీంనగర్ లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు, అయితే తలకు బలమైన గాయం కావడం వల్ల ఇప్పుడే వైద్యులు ఏం చెప్పలేని పరిస్థితి, ఇంత చిన్న వయసులో కుటుంబాన్ని పోషించే బాధ్యత తీసుకున్న ఆ యువకునికి, వి హెచ్ ఆర్ ఫౌండేషన్ బాసటగా నిలిచింది, 27 వ డివిజన్ ఫౌండేషన్ ఇంచార్జ్ ఎన్ యుగేందర్ అభ్యర్థన మేరకు ఫౌండేషన్ ఫౌండర్ వ్యాళ్ల హరీష్ రెడ్డి వెంటనే వైద్య ఖర్చుల నిమిత్తం 10000/– రూపాయలను అందించాలని రామగుండం ఫౌండేషన్ టీం సభ్యులకు ఆదేశించారు, వారి ఆదేశానుసారం ఫౌండేషన్ రామగుండం ఇన్చార్జ్ సిగిరి రాము ఆధ్వర్యంలో ఆ మొత్తాన్ని యువకుని కుటుంబ సభ్యులకు అందించారు, ఈ కార్యక్రమంలో వి హెచ్ ఆర్ ఫౌండేషన్ సభ్యులు , సదానందం, రాకేష్ మహమూద్, షఫీ లతోపాటు, స్థానిక మహిళ భారతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా
# అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు

**మంథని** 75వ భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మంథని పట్టణంలోని అంబేద్కర్ చౌక్ లో గల అంబేద్కర్ విగ్రహానికి పలు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేరువేరుగా జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది రఘోత్తంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ నాయకుడు గోటికారి కిషన్ జీ, విద్యార్థి నాయకుడు బెజ్జంకి డిగంబర్, , కాంగ్రెస్ నాయకులు మంథని శ్రీనివాస్, ఐలి శ్రీనివాస్,సీనియర్ సిటిజన్ తాటి బుచ్చన్న గౌడ్,రిటైర్డ్ ఫారెస్ట్ ఆఫీసర్ బూడిద రాజయ్య, మాజీ వార్డు సభ్యుడు టక్కే గారి కిట్టన్న, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అజీమ్ ఖాన్, బిజెపి నాయకులు సత్య ప్రకాష్, సబ్బని సంతోష్, బోయిని నారాయణ, ప్రజా సంఘాల నాయకుడు వేల్పుల సురేష్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# డయాలసిస్ సేవలు
# సద్వినియోగం చేసుకోండి

## – మెడికల్ సూపరెండెంట్ రాజశేఖర్



**మంథని**మంథని ప్రభుత్వ ఆసుపత్రిలో 5 పడకల డయాలసిస్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని మెడికల్ సూపరెండెంట్ రాజశేఖర్ కోరారు. డయాలసిస్ కోసం ప్రజలు దూరప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా మంథనిలోనే రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు చేతుల మీదుగా ఆగస్టు నెలలో ప్రారంభించడం జరిగిందని గుర్తు చేశారు. సింగిల్ యూసెజ్ ఫిల్టర్ ద్వారా రోగులకు డయాలసిస్ సేవలు అందిస్తున్నామన్నారు. డయాలసిస్ సేవలు అందుకుంటున్న రోగుల సంఖ్య ఆధారంగా అవసరమైన పరికరాల స్టాక్ ముందస్తుగా అందుబాటులో ఉంచుతున్నామని మెడికల్ సూపర్డెంట్ రాజశేఖర్ తెలిపారు.

# బలపడనున్న వాయుగుండం

**విశాఖపట్నం** దక్షిణ బంగాళాఖాతం పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన వాయుగుండం రానున్న 24గంటల్లో మరింత బలపడి ఇది తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని విశాఖ వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో దక్షిణకోస్తా, ఉత్తరకోస్తాలో రానున్న 2రోజుల పాటు తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారి ప్రకటించారు. ఈనెల 28,29 తేదీన ఏపీలోని నెల్లూరు, తిరుపతి, ప్రకాశం, శ్రీకాకుళం,విశాఖ జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని,తీర ప్రాంతాల్లో 35 నుంచి 55కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే ఛాన్స్ ఉందని వివరించారు.దక్షిణ కోస్తాలో మత్స్య కారులు వేటకు వెళ్లకూడదని హెచ్చరించారు.

# హైదరాబాద్ నుంచి
# స్వర్ణపాదుకల పల్లకి యాత్ర

**హైదరాబాద్** దేశంలోనే తొలిసారిగా జరగబోయే శ్రీ రామ దీక్ష మరియు స్వర్ణ పాదుకల పల్లకి పాదయాత్ర మన భాగ్యనగరం నుండే జరుగబోతుంది. మొట్టమొదటిసారిగా రామరాజ్యం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీ రామ దీక్ష.. మహాద్భుత కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దైవ భక్తితో పాటు దేశభక్తిని పెంపొందించాలని ఆశయంతో, యువతీ యువకులందరు రామదీక్షను చేపట్టాలనే సదుద్దేశంతోనే... రామరాజ్యం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువులు, మహర్షులు తెలిపిన విధంగా శ్రీరాముని గొప్పతనాన్ని ఈ లోకానికి, మన భావి తరాలకు అందించాలననే సదుద్దేశంతో.. రామ దీక్ష కార్యానికి శ్రీకారం చుట్టాము..అసలు రామదీక్షను ఎందుకు తీసుకోవాలని ఒకసారి ఆలోచిస్తే అనేక ప్రాథమిక విషయాలు బోధపడతాయి ఆధ్యాత్మిక శక్తిని పెంపొందించుకుంటూ దేశభక్తిని కూడా యువతలో నింపుకునేలా ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది రామరాజ్యం ఫౌండేషన్.. ఆనాడు రావణుడి సంహారం తర్వాత విభీషణుడు లంక నుంచే రాజ్య పరిపాలన చేయాలని అక్కడి ధన భాండాగరంతో రాజ్యాన్ని పరిపాలించాలని శ్రీరాముడు పై ఒత్తిడి తెచ్చినా. అందుకు శ్రీరామచంద్రుడు నిరాకరిస్తూ, భారత ప్రజలందరికీ దేశభక్తిని, భరత జాతి గొప్పతనాన్ని ఆనాడే ఈవిధంగా చాటాడు.. జనని జన్మభూమిశ్చ స్వర్గదపీ గరియేసి.. అని మాతృభూమిపై ఉన్న మమకారాన్ని దేశభక్తిని చాటుకున్నాడు... ఆ శ్రీరామ తత్వాన్ని ఆ వారసత్వాన్ని తిరిగి మన యువతలో, పరిపూర్ణంగా నింపుకునేందుకు రామదీక్షకు సంసిద్ధమయింది రామరాజ్యం ఫౌండేషన్ ఈ మహా దీక్షలో యువత వందలాదిగా వేలాదిగా లక్షలాదిగా తరలి రామదీక్షకు సంసిద్ధులై రావాలి. శ్రీరామచంద్రుడు దేశభక్తి చాటిన విధానాన్ని రామదీక్షతో మనమంతా చాటే విధంగా మన భాగ్యనగరంలోని లంగర్ హౌస్ లోని రామలీల మైదానం, మచు కుందా నది తీరం నుండి అయోధ్య నగరానికి కాలినడకన స్వర్ణ మయమైన రామ పాదుకలను పల్లకిలో మోసుకుంటూ, పాద యాత్ర చేస్తూ అయోధ్య నగరాన్ని కాస్త పలకరించి వద్దాం అని పిలుపునిచ్చారు సుమారు 300 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు ఈనెల 17వ తేదీ బాపు ఘాట్ వద్ద మొదలైన పాదయాత్ర అయోధ్యకు చేరేవరకు 301వ తేదీ అవుతుందని నిర్వాహకులు తెలిపారు.

# నూతన పార్లమెంట్‌లో
# తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ

## – నూతన కార్యాలయం ప్రారంభం

## – పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపి కేశినేని శివనాథ్

**ఢిల్లీ** నూతన పార్లమెంట్ మొదటి అంతస్తులో తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీకి కేటాయించిన నూతన కార్యాలయం ప్రారంభోత్సవం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన పూజకార్యక్రమాల్లో టిడిపి ఎంపిలతో పాటు విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ పాల్గొన్నారు. తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీకి నూతన పార్లమెంట్ భవనంలో మొదటి అంతస్తులో కేటాయించిన నూతన కార్యాలయం ఎఫ్09 నుంచి కార్యకలాపాలు ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు.నూతన పార్లమెంటులో ప్రధాని, కేంద్ర మంత్రుల కార్యాలయాలు ఉన్న మొదటి అంతస్తులో తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ కార్యాలయం ఉండటం గర్వంగా ఉందన్నారు. జూన్ నెలలో జరిగిన పార్లమెంట్ సమావేశాల సమయంలో తమకి కేటాయించిన కార్యాలయం గది చిన్నదిగా వుండటంతో , కావున కొంచెం విశాలమైన స్థలం వున్న కార్యాలయం కేటాయింపు చేయాల్సిందిగా టిడిపి పార్లమెంట్ పక్ష నేత లావు కృష్ణదేవరాయ ఆధ్వర్యంలో టిడిపి ఎంపీలందరూ కలిసి వెళ్లి స్పీకర్ ఓం బిర్లా కోరటం జరిగింది. తమ విజ్ఞప్తి పై స్పందించి విశాలమైన కార్యాలయం కేటాయించినందుకు ఎంపి కేశినేని శివనాథ్ స్పీకర్ ఓం బిర్లాకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి పార్లమెంట్ పక్ష నేత లావు కృష్ణదేవరాయలు, కేంద్ర పౌరవిమానాయన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపి మెతుకుమిల్లి భరత్, ఎంపి కలిమిశెట్టి అప్పలనాయుడు,ఎంపి హరీష్ మాథుర్ బాలయోగి, ఎంపి మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావు,ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి , ఎంపి తెన్నేటి కృష్ణ ప్రసాద్, తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ సెక్రటరీ సత్యనారాయణ పాల్గొన్నారు.

# ఆటో ట్రక్కు ఢీ..విద్యార్థులకు గాయాలు



**హైదరాబాద్** మంగళవారం ఉదయం 9 సమయంలో లంగర్ హౌస్ వైపు నుండి ఇబ్రహీం భాగు లోని న్న వాసవి కాలేజ్ కి విద్యార్థులతో వున్న ఆటో వెళ్తుండగా ప్రమాదవశాత్తు ఆటో ముందు టైరు బ్లాస్ట్ అయింది. దాంతొఓ ఆటో ముందున్న ట్రక్కును ఢీకొంది. ఆటోలో ఉన్న విద్యార్థులకు తీవ్ర గాయాలు చోటుచేసుకున్నాయి. స్థానికులు సహాయంతో లంగర్ హౌస్ లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్ కు విద్యార్థులను తరలించారు. వివేక్, కార్తీక్, (విద్యార్థులు), మల్లేష్ (ఆటో డ్రైవర్) సీరియస్ గా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. తరుణ్, హరికృష్ణ, సాత్విక్, స్వరాజ్ ఈ విద్యార్థులకు స్వల్పగాయాలయ్యాయి.

# మెరుపు ధర్నా

**నిర్మల్** దిలావర్పూర్ మండల జాతీయ రహదారిపై దిలావర్పూర్ గ్రామస్తుల మూకుమ్మడి గా రహదారి రాస్తారోకో చేసి రోడ్డు దిబ్బంధం చేసారు. మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీ రద్దు చేయాలని నినాదాలు చేసారు. గత కొన్ని రోజులుగా దిలాల్పూర్, గుండంపల్లి గ్రామాల ప్రజలు ధర్నాలు చేస్తున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసారు.

# రెండు లారీల ఢీ: లారీ దగ్ధం

**సూర్యాపేట** కోదాడ మండలం, దొరకుంట వద్ద జాతీయ రహదారిపై తెల్లవారుజామున సిమెంటు లారీ దగ్ధం అయింది. ఆగి ఉన్న లారీని వెనుక నుండి మరో లారీ ఢీకొట్టింది. కోదాడ నుండి విజయవాడ వైపుకు వెళ్తుండగా ఘటన జరిగింది. షార్ట్ సర్క్యూట్ తో లారీలో మంటలు చెలరేగాయి. నాగార్జున సిమెంట్ ఫ్యాక్టరీ నుండి కొండపల్లి వెళ్తున్నట్లుగా గుర్తించారు.

# పత్తి ట్రాక్టర్ బోల్తా?

**ఖమ్మం** ఖమ్మం నగరంలోని నడిబొడ్డులో ఇల్లందు క్రాస్ రోడ్ లో కామేపల్లి నుంచి వ్యవసాయ మార్కెట్ కు పత్తిలోడుతో వస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ అతివేగముగా అజాగ్రత్తగా నడుపుకుంటూ వస్తున్న ట్రాక్టర్ పల్టీ కొట్టింది. పల్టీ కొట్టిన సమయంలో ఎప్పుడూ రద్దీగా ఉండే ఇల్లందు క్రాస్ రోడ్ పరిసరాల ప్రాంతంలో ఎవరు లేకపోవటం వల్ల ప్రాణ నష్టం జరగలేదు. ఇలా ప్రమాదాలు జరగటానికి లైసెన్స్ లేని పిల్లలకు ట్రాక్టర్లు ఇచ్చి పంపించడం వల్ల జరిగింది. యజమానిపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## రసాభాసగా ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ కార్యక్రమం

**సికింద్రాబాద్** సికింద్రాబాద్ లో జరిగిన కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కుల పంపిణీ మరోసారి రసాభాసగా మారింది. సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు చెక్కుల పంపిణీ లో కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతల మధ్య వాగ్వివాదం చెలరేగింది. . పోటాపోటీగా నినాదాలు చేసుకున్ఆరు. .క్యాంపు కార్యాలయంలో కాకుండా కమ్యూనిటీ హాల్లో చెక్కుల పంపిణీ పై అధికారుల తీరుపై పద్మారావు ఆగ్రహం వ్యక్తం చేసారు. మరోసారి రిపీట్ అయితే స్పీకర్ కు ఫిర్యాదు చేస్తానంటూ హెచ్చరించారు.

# భారత రాజ్యాంగ పీఠిక
# మన దేశ ఔన్నత్యానికి ప్రతీక

## – రాముని చెరువు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు



**మందమర్రి** మంచిర్యాల రాముని చెరువు కట్ట రీడింగ్ రూమ్ ఆవరణలో రాముని చెరువు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం 75వ, భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినారు. ఈ కార్యక్రమానికి ముందుగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పలువురు వాకర్స్ నాయకులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించినారు. ఈ సందర్భంగా వాకర్స్ నాయకులు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగాన్ని 1949 నవంబర్ 26న, రాజ్యాంగ సభ ఆమోదించిందని దేశమంతా ఒక్కటే అందరికీ అన్ని సమాన హక్కులు కల్పించే సమానత్వానికి నిలువుటద్దం రాజ్యాంగం అని అన్నారు. భారత రాజ్యాంగం ప్రపంచంలో కెల్లా మహోన్నతమైనదని రాజ్యాంగ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ కొనసాగించాలన్నారు. భారత రాజ్యాంగ పీఠిక మన దేశ ఔనత్వానికి ప్రతీక అని ఆధునిక ప్రజాస్వామ్య చరిత్రలో విశిష్టమైనదని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగ పరిరక్షణ కోసం కృషి చేయాలని పేర్కొన్నారు. భారత రాజ్యాంగం వర్ధిల్లాలి అని పెద్ద పెట్టున నినాదాలు చేసి, అందరికీ భారత రాజ్యాంగ 75వ, దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు ఆకుల సత్యన్న, అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, ఉపాధ్యక్షులు బూర్ల జ్ఞాని, కార్యదర్శి పి. రామ్ రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి లాల్ కుమార్, సలహాదారులు కార్యవర్గ సభ్యులు, వోజ్జల మనోహర్, ఓడేటి కృష్ణారెడ్డి, కె.వి కృష్ణారావు, దండే మధు, మార్కండేయ, రామ్ రెడ్డి, లక్ష్మణరావు, టీచర్స్ గోలి మనోహర్ రావు, రామ్ రెడ్డి, లక్ష్మణ్ రావు, డాక్టర్ త్రినాధరావు, డాక్టర్ విశ్వేశ్వర రావు, డాక్టర్ మూర్తి, కే. రమణ, మల్లేష్, ఎన్ ఆర్. శ్యామ్,జి తిరుపతి, జి. సత్యనారాయణమూర్తి, దుర్గం లక్ష్మణ్, మొగిలి, విగ్నేష్ బోడకుంట, నవీన్, రాజిరెడ్డి, గౌడిసెల రాజారాం, పాయల మల్లన్న, పర్వతాలు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగం మన అందరికీ ఒక దిక్సూచి

**- బద్వేల్ ఎమ్మెల్యే డా.దాసరి సుధ**



**బద్వేలు** రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బద్వేల్ మున్సిపాలిటీ లో మంగళవారం మన దేశ రాజ్యాంగ నిర్మాత, పిత డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి గజ పూలమాలలతో నివాళులు అర్పించిన బద్వేల్ నియోజక వర్గ శాసన సభ్యురాలు డా.దాసరి సుధ మాట్లాడుతూ మన రాజ్యాంగాన్ని ఆమోదింప చేసుకొని 75 సంవత్సరాలు అయింది అని ,మన రాజ్యాంగం ప్రపంచం లో కెల్లా అత్యంత గొప్ప రాజ్యాంగం అని కొనియాడారు.ప్రభుత్వాలు మరియు దేశం లో ఉండే ప్రతి ఒక్కరికీ రాజ్యాంగం ఒక దిక్సూచి అని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమం లో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్ రెడ్డి,మాజీ కూడా చైర్మన్ గురు మోహన్,మున్సిపాలిటీ అధ్యక్షులు సుందర రామిరెడ్డి,బద్వేల్ మండల వైసీపీ నాయకుడు రామ సుబ్బా రెడ్డి,జిల్లా కార్యదర్శి యెద్దా రెడ్డి,మున్సిపల్ వైస్ చైర్మన్ సాయి కృష్ణ,మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ నాగం సుబ్బారెడ్డి,యూనివర్సిటీ మాజీ బోర్డు మెంబర్ కొండపల్లి సుబ్బారావు,అధికార ప్రతినిధి వెంకటేశ్వర్లు,మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీ మునేయ్య,కౌన్సిలర్స్ ఆయా వార్డు ఇన్చార్జి లు శివయ్య,మౌలాలి,చెన్నకృష్ణా రెడ్డి,నారాయణ ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబానికి అండగా ఉంటాం

**- బద్వేలు వైసిపి సమన్వయకర్త విశ్వనాథరెడ్డి**

**- 50 వేల రూపాయలు ఆర్థిక సహాయం చేసిన విశ్వనాథరెడ్డి**



**బద్వేలు** బద్వేలు నియోజకవర్గం కాశినాయన మండలం లోని చిన్నాయపల్లె కు చెందిన గుర్రాల శ్రీనివాసులు రెడ్డి,భార్య అరుణ,పవిత్ర లు రోడ్డు ప్రమాదంలో మరణించిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న బద్వేల్ నియోజవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాథ రెడ్డి వారి పార్థివ దేహాలను సందర్శించి నివాళులర్పించారు. ఒకే కుటుంబంలో ముగ్గురు మరణించడం బాధాకరమన్నారు. మృతుడి కుమారుడికి రూ.50 వేలు ఆర్థిక సహాయం అందించారు.అదేవిధంగా భవిష్యత్తులో మృతుని కుమారునికి తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

# పాలనకు జవాబుతారీతనాన్ని జతచేసిన రాజ్యాంగం

**- ప్రజల ప్రాథమిక హక్కుల రక్షణ బాధ్యత న్యాయవ్యవస్థలదే**

**- సర్వజనీన ఓటు హక్కు, సామాజిక న్యాయం ఇచ్చింది.**

**- బద్వేల్ రూరల్ 3వ మహాసభల్లో సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్.**



**బద్వేలు** బద్వేలు స్థానిక కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య భవనములో మంగళవారం భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్), సిపిఎం బద్వేల్ రూరల్ మండల కమిటీ 3వ మహాసభలు కామ్రేడ్ బి లక్ష్మీనరసయ్య, పి.సరస్వతి అధ్యక్షతన ప్రారంభమైంది. ఈ మహాసభలను ఉద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ... నేడు దేశవ్యాప్తంగా 75 వ భారత రాజ్యాంగ దినోత్సవ సభలు ఒకవైపు జరుగుతున్నాయని, మరోవైపు "ప్రగతిశీల అభివృద్ధికర భారత రాజ్యాంగాన్ని" సమూలంగా మార్చడానికి కేంద్రంలోని బిజెపి ప్రయత్నిస్తుందని, రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి, దేశంలోని "లాల్ – నీల్" ఐక్యంగా ఉద్యమించాల్సిన చారిత్రాత్మక అవసరం నేడు దేశంలో ఏర్పడిందన్నారు. భారత రాజ్యాంగం పాలనకు జవాబుదారీతనాన్ని జత చేసినది అన్నారు. ప్రజల ప్రాథమిక హక్కులను పాపారాల్సిన బాధ్యతను న్యాయ వ్యవస్థ పై పెట్టిందని గుర్తు చేశారు. సర్వజనేన ఓటు హక్కు తో పాటు "సామాజిక న్యాయం" పాలకులు అమలు చేయాలని ఆదేశించిందని తెలిపారు. రాజ్యాంగ మౌలిక స్వరూపం మార్చే హక్కు బీజేపీ కే కాదు, మరెవరికి కూడా లేదన్నారు. ఈ విషయంపై కేశవానంద భారతి వర్సెస్ కేరళ రాష్ట్ర ప్రభుత్వం, మరియు ఎస్.ఆర్.బొమ్మై కేసుల్లో స్పష్టమైన తీర్పులు సుప్రీంకోర్టు ఫుల్ పెంచి ఇచ్చిందన్నారు. బిజెపి 2014 నుండి నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వం భారత రాజ్యాంగానికి తూట్లు పొడుస్తోందని, హిందుత్వా రాజ్యాంగాన్ని తేవటానికి, మనుధర్మ శాస్త్ర ఆధార చట్టాలను అమలు చేయటానికి గట్టిగా ప్రయత్నిస్తోందని, ఇది దేశ సమైక్యత, సమగ్రతలకు ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించారు. నేడు దేశంలో రాజ్యాంగ పరిరక్షణ కోసం "లాల్ – నీల్" ఐక్యంగా ఉద్యమించాల్సిన చారిత్రాత్మకమైన అవసరం ఏర్పడిందని నేడు ప్రజలు కోరుకుంటున్నారని వారు అన్నారు. రాజ్యాంగ పీఠిక పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థకు తన దీపిక లాంటిదని ఇందులో ఉన్న సెక్యులర్ ప్రోత్సహిస్తూ సమగ్రత అనే పదాలను తొలగించాలని బిజెపి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని దీనిని బిజెపి మిత్ర పక్షాలు వ్యతిరేకించాలని రాష్ట్రంలోనే ఎన్డీఏ ప్రభుత్వం టిడిపి జనసేన కూడా ప్రతికరించాలని ప్రతిపక్ష వైసిపి తన వైఖరి స్పష్టం చేయాలని వారు డిమాండ్ చేశారు. 2017లో బిజెపి "జమిలి ఎన్నికలు" పేరుతో దేశాన్ని ఎప్పటికీ తనే పరిపాలించాలని, ప్రాంతీయ పార్టీలను మింగేయడానికి ప్రయత్నిస్తుందని ఈ విషయం అర్థం కాక టిడిపి, వైసిపి, జనసేన, బిజెపి బుట్టలో పడుతున్నాయని వారు తెలిపారు. ఇజ్రాయిల్, పాలస్తీనా వివాదం పై స్థిరమైన వైఖరి బిజెపి ప్రభుత్వం తీసుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ నాయకత్వంలోని ఇండియా కూటమి పక్షాలకు, బిజెపిని వ్యతిరేకించే వామపక్షాలకు ఎం.పీ. సీట్లు కేటాయించకుండా తాను సొంతంగా 250 సీట్లకు పోటీ చేసి కేవలం 99 సీట్లు గెలిచిందని, ఇందులో 44 సీట్లు వామ పక్షంపై, మిత్రపక్షాలపై గెలిచినవేననీ ఆయన ఎద్దేవో చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జీ.శివకుమార్ పాల్గొని ప్రసంగించారు. ఆవాజ్ జిల్లా అధ్యక్షులు పి.చాన్ బాషా పాల్గొన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు ఆర్.ఓబయ్య జండా ఆవిష్కరణ చేశారు. ఇదే సందర్భంగా బద్వేలు రూరల్ నూతన కమిటీ 9 మందితో ఎన్నిక చేసుకున్నారు. రూరల్ కార్యదర్శిగా దాసరి వెంకటేష్ ను మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకున్నది.

# యువత చెడు వ్యసనాలనుంచి దూరంగా వుండాలి

**హైదరాబాద్** యువత గంజాయి, డ్రగ్స్లాంటి మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలకు బానిసకావద్దని మల్కాజిగిరి ఎసిపి చక్రపాణి అన్నారు. నాచారం లో జాన్సన్ గ్రామర్ స్కూల్ లో విద్యార్థిని విద్యార్థులకు నాచారం పోలీసులు, సైబర్ క్రైమ్, నార్కోటిక్ సంయుక్తంగా సైబర్ నేరాలు, గంజాయి ఇతర మత్తు పదార్థాలపై విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో చెడు వ్యసనాలకు భానిసకాకుండా ఏకాగ్రతతో విద్యను అభ్యసించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అపరిచిత వ్యక్తులు, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. షీ టీమ్స్ ప్రాముఖ్యత, నిర్వహించే విధులు, ఫోక్సో చట్టాలు, సోషల్ మీడియా, సైబర్ సెక్యూరిటీ, డయల్ 100 ప్రాముఖ్యతపై వివరించారు. విద్యార్థి దశ చాలా కీలకమని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ప్రవర్తించి క్రమశిక్షణతో ముందుకు వెళ్లాలని సూచించారు. ఎవరైనా వేధించిన, రోడ్డుపై వెళ్లేటప్పుడు అవహేలనగా మాట్లాడిన, ఉద్దేశపూర్వకంగా వెంబడిరచిన వెంటనే డయల్ 100 కాల్ చేసి సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. అలాగే విద్యార్థుల తల్లిదండ్రులు వారి బాగోగులతో పాటు సరైన మార్గంలో వెళ్తున్నారో లేదో చూడాలని సూచించారు.

## విద్యార్థులతో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

**హైదరాబాద్** సంతోష్ నగర్ ట్రాఫిక్ పోలీసులు మంగళవారం నాడు ఎన్ ఎస్ ఎస్ విద్యార్థినీ, విద్యార్థులతో కలిసి చంపా పేట చౌరస్తాలో ట్రాఫిక్ నియమాలపై ప్ల కార్డులతో ప్రదర్శన నిర్వహించారు. హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి అనే నినాదాలతో విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శించారు. హెల్మెట్ ధరించాలని, మైనర్లు డ్రైవ్ చేయకూడదని, సీటు బెల్టు పెట్టుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తీసుకువెళ్లకూడదని పోలీసులు సూచించారు. చిన్న చిన్న నిబంధనలను నిర్లక్ష్యం చేస్తే విలువైన ప్రాణాల్ని పోగొట్టుకోవాల్సి వస్తోందని ఇన్స్పెక్టర్ నర్సింహ నాయక్ తెలిపారు..ఈ కార్యక్రమంలో ఎస్ ఐ లు సత్యనారాయణ. వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

**డోన్** :డోన్ కొత్తపేట జడ్పీ హై స్కూల్ నందు మంగళవారం ఉదయం రాజ్యాంగ దినోత్సవం ను పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు రామనరసప్ప అధ్యక్షతన ఘనంగా నిర్వహించడం జరిగింది, పాఠశాల ఉపాధ్యాయులు రాజ్యాంగ రచించిన డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కు నివాళులు అర్పించిన అనంతరం రామనర్సప్ప మాట్లాడుతూ మన దేశ రాజ్యాంగాన్ని ప్రతి పౌరుడు గౌరవించడం ముఖ్యం అనీ, అందరు రాజ్యాంగాన్ని లోబడి వ్యవహారించాలి అన్నారు,ఈ కార్యక్రమం లో పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాసులు, లోకనాథ్ రెడ్డి, మాణిక్యం శెట్టి, చంద్రుడు, సుధాకర్ ప్రకాష్ రెడ్డి,నారాయణ బాబ్జి,రజినీకాంత్,జయప్రద నూర్జహాన్, సువర్ణ, రాఘవేంద్రమ్మ, లక్ష్మి దేవి,నాగలక్ష్మమ్మ,పుష్పలత,తదితరులు పాల్గొన్నారు

**రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు :** 1949సం నవంబరు 26వ తేదిన భారత రాజ్యాంగ పరిషత్ రాజ్యాంగాన్ని ఆమోదించింది. అయితే భారత రాజ్యాంగం మాత్రం 1950 జనవరి 26 నుంచి అమలులోకి వచ్చింది. అందుకే నవంబరు 26ను భారత రాజ్యాంగ దినోత్సవంగాను మరియు జనవరి 26ను గణతంత్ర దినోత్సవంగాను మనం జరుపుకుంటున్నాము. రండి! భారత పౌరులమైన మనమందరం, నేడు మన రాజ్యాంగ దినోత్సవాన్ని బాధ్యతగా జరుపుకుందాం! సమానత్వం – స్వేచ్ఛ – సౌభ్రాతృత్వం – లౌకిక రాజ్యం లాంటి ప్రత్యేకతలతో మన రాజ్యాంగం విలసిల్లుతున్నది.

# మన భారత రాజ్యాంగం మహోన్నతమైనది

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్. ఎస్**

**తిరుపతి :** ప్రపంచంలో కెల్లా అత్యున్నత రాజ్యాంగం మన భారత రాజ్యాంగం అని, రాజ్యాంగ స్ఫూర్తిగా ప్రతి ఒకరూ నడుచుకోవాలని, సదరు మార్గదర్శకాల మేరకు అధికారులు అందరూ బాధ్యతగా రాజ్యాంగ స్ఫూర్తిగా పేద ప్రజలకు తమ సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్.ఎస్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరం నందు భారత రాజ్యాంగ ప్రవేశిక ఆమోద దినం సందర్భంగా భారత ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో భారత రాజ్యాంగ ప్రవేశిక ఆమోద దినాన్ని ఘనంగా నిర్వహించాలన్న సూచనల మేరకు కలెక్టర్ గారు జెసి శుభం బన్సల్, జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు జిల్లా అధికారులు తదితరులతో కలిసి ఘనంగా నిర్వహించారు. ముందుగా కలెక్టర్ తదితరులు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం రాజ్యాంగ ప్రవేశిక చదివి అందరితో జిల్లా కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మన భారత రాజ్యాంగం ఎంతో గొప్ప ఆదర్శవంతమైన రాజ్యాంగమని పేర్కొన్నారు. భారత రాజ్యాంగాన్ని రచించిన మహానుభావులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిరకాలం మన ప్రజలందరి మదిలో ఉన్నారని అన్నారు. పలుమార్లు మేథోమథనం అనంతరం రాజ్యాంగం రూపొందిందని అన్నారు. ప్రతి సంవత్సరం నవంబర్ 26 న "సంవిధాన్ దివస్" దేశవ్యాప్తంగా జరుపుకుంటారని, ఈ రోజున 1949లో భారత రాజ్యాంగం అంగీకరించబడిన రోజును గుర్తు చేస్తుందని, ఆ రోజు రాజ్యాంగాన్ని అమలు చేసేందుకు మొదలు పెట్టారని, కానీ ఇది 1950 జనవరి 26 న పూర్తిగా అమలులోకి వచ్చిందని పేర్కొన్నారు. నాటి నుండి భారతదేశం ఒక ప్రజాస్వామ్య దేశంగా అధికారికంగా మారిందని అన్నారు. కాలానుగుణంగా మన రాజ్యాంగంలో సవరణలు ఎప్పటికప్పుడు జరుగుతున్నాయని తెలిపారు. నేడు అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో అధికారులు, ప్రజా ప్రతినిధులు రాజ్యాంగ ప్రవేశిక చదివి ప్రతిజ్ఞ చేయడం జరుగుతోందని తెలిపారు. రాజ్యాంగ ప్రవేశికలోని ప్రతి పదం ఎంతో మహోన్నతమైన భావజాలాన్ని కలిగి ఉన్నదని, సార్వభౌమ, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్యం, న్యాయం, సమానత్వం, సౌభ్రాతృత్వానికి హామీ ఇస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా మనం ప్రజాసేవలో రాజ్యాంగ స్ఫూర్తిగా పనితీరు ఉండాలని పేద ప్రజల అభ్యున్నతికి వారి సంక్షేమానికి అభివృద్ధికి మనసా వాచా కర్మణా బాధ్యతగా అంకితభావంతో పనిచేయాలని పేర్కొన్నారు రాజ్యాంగంలోని ప్రతి పదం ఒక ఉన్నతమైన ఆశయాన్ని సూచిస్తుందని తెలిపారు. జెసి మాట్లాడుతూ రాజ్యాంగ ప్రవేశిక ఆమోదం పొందిన నేటి రోజున ఈ కార్యక్రమం నిర్వహించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని, ప్రజాసేవలో భారత రాజ్యాంగ స్ఫూర్తి అమలుకు అన్ని స్థాయిల్లో అధికారులు పనిచేయాలని, మన దైనందిన జీవితంలో రాజ్యాంగ స్ఫూర్తితో జీవించాలని కోరారు. జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ రాజ్యాంగ ప్రవేశిక దినాన్ని మన జిల్లా కలెక్టరేట్ నందు నిర్వహించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సిబ్బంది కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శారదా పీఠంలో మహా మృత్యుంజయ హోమం

**విశాఖపట్నం** కార్తీక మాసం సందర్భాన్ని పురస్కరించుకుని విశాఖ పెందుర్తి శారదా పీఠంలో మహా మృత్యుంజయ హోమం, రుద్రాభిషేకం నిర్వహించారు. యజ్ఞం అనంతరం మహా పూర్ణహుతి కార్యక్రమాన్ని జరిపించి భక్తులకు యాగఫలం అందించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులతో పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి ప్రత్యక్షంగా చంద్రమౌళీశ్వరులకు అభిషేకాలు చేయించారు.

# ఆదానితో వైకాపా ప్రభుత్వం ఒప్పందం చేసుకోలేదు

**విశాఖపట్నం** గత ప్రభుత్వం అదానితో ఒప్పందం చేసిందని చూపిస్తే దేనికైనా సిద్ధమని మాజీ మంత్రి అమర్ ఏపీ ప్రభుత్వానికి సవాల్ చేశారు.గత ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వ సంస్థతో మాత్రమే ఒప్పందం చేసుకున్నామని,అదానితో ఒప్పందం చేసిందని ఆధారాలు చూపించాలని సవాల్ చేశారు.

## రైల్వేలో యూనియన్ల ఎన్నికల ప్రకటన విడుదల

**విజయవాడ** దక్షిణ మధ్య రైల్వే పరిధిలో గుర్తింపు సంఘాలకు సంబంధించి ఎన్నికల ప్రకటన విడుదలైంది.ఈ ఎన్నికల్లో ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ మరోసారి సత్తా చాటాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది.

ఎన్నికల తేదీలు దగ్గర పడటంతో నాయకులు ప్రచారం ముమ్మరం చేసిన శ్రామిక్ యూనియన్ నేతలు ... గతంలో చేసిన పోరాటాలతో సాదించిన విజయాలను వివరిస్తూ మరోసారి ఎన్నికల బరిలోకి నిలిచింది.నిరంతరం కార్మికుల పక్షాన నిలుస్తున్న ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ కు కార్మికులు అండగా నిలిచి తమ మద్దతు అందించాలని యూనియన్ నాయకులు రామ్మోహన్ రావు కోరారు.

# నగరంలోని రోడ్లలో గుంతలను పూడ్చండి

**- కమిషనర్ ఎన్.మౌర్య**



**తిరుపతి :** తిరుపతి నగరంలోని ప్రధాన వీధులు, సందుల్లోని రోడ్లలో ఎక్కడా కూడా గుంతలు లేకుండా పూడ్చాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం నగరంలోని అన్నమయ్య కూడలి, రైతు బజారు, ఎమ్మార్ పల్లి, పోలీసు స్టేషన్ రోడ్డు, ఆర్.సి.రోడ్డు, తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను, రోడ్లపై ఉన్న గుంతలను ఇంజినీరింగ్, హెల్త్ అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. పలు చోట్ల గుంతలు ఉండడం, మురుగు నీరు రోడ్లపైకి వస్తుండడంతో అధికారులపై అసహనం వ్యక్తం చేసి, వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రధాన వీధులు, సందుల్లో గల రోడ్లలో గుంతలను పూడ్చలాని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పలుచోట్ల ఉన్న చెత్త కుప్పలను తొలగించాలని హెల్త్ సిబ్బందిని ఆదేశించారు.మురుగు నీరు రోడ్లపైకి వస్తున్నాయని వెంటనే వాటిని అరికట్టి, ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని అన్నారు. అనంతరం ఈ.ఎస్.ఐ.వద్ద గల అన్నా క్యాంటీన్ ను కమిషనర్ పరిశీలించారు. ప్రజలకు అందిస్తున్న టిఫిన్ ను పరిశీలించారు. పరిశుభ్రమైన వాతావరణంలో ప్రజలకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందించాలని అన్నారు. రాయలచెరువు రోడ్డులోని రైతు బజార్ ను పరిశీలించి వాహన చోదకులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ట్రాఫిక్ పోలీసులను ఆదేశించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్, డి.ఈ.మహేష్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, తదితరులు ఉన్నారు.

# శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



**తిరుపతి** తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. టిటిడి జెఈవోలు గౌతమి, వీరబ్రహ్మం పాల్గొన్నారు.ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి సహస్రనామార్చన, శుద్ధి నిర్వహించారు. అనంతరం ఉదయం 6 నుండి 9 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపట్టారు. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేశారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణంతో పాటు పలు సుగంధ ద్రవ్యాలు కలిపిన పవిత్ర జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. ఈ కారణంగా కల్యాణోత్సవం, ఊంజల్‌సేవను రద్దు చేశారు.

**పరదాలు విరాళం :**

సందర్భంగా ఆలయానికి హైదరాబాదుకు చెందిన స్వర్ణకుమార్ రెడ్డి ఆరు పరదాలు, రెండు కురాళాలు, తిరుపతికి చెందిన సుధాకర్, జయ చంద్రారెడ్డి, అరుణ్ కుమార్ నాలుగు పరదాలు 25 హుండీ వస్త్రాలు విరాళంగా జేఈవో శ్రీ వీరబ్రహ్మంకు అందించారు.

**నవంబరు 28 నుండి బ్రహ్మోత్సవాలు :**

శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు నవంబరు 28 నుండి డిసెంబరు 6వ తేదీ వరకు వైభవంగా జరుగనున్నాయి. ఇందుకోసం నవంబరు 27వ తేదీన ఉదయం లక్ష కుంకుమార్చన, సాయంత్రం అంకురార్పణ నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల్లో ఉదయం 8 నుండి 10 గంటల వరకు, రాత్రి 7 నుండి 9 గంటల వరకు ఆలయ మాడ వీధుల్లో వాహనసేవలు జరుగనున్నాయి.

# రాజ్యాంగం ఆధారంగానే భారతదేశం ఫరిఢవిల్లుతుంది

**- యావత్ ప్రపంచంలోనే అజేయ శక్తిగా ఆవిర్భవించనున్న భారత్**

**- దేశంలో నిక్షిప్తంగా దాగివున్న శ్రమశక్తిని బయటకు తీయాలి**

**- నైపుణ్య కేంద్రాలను ప్రారంభించాలని విద్యాసాగర్ రావు పిలుపు**

**- బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు**

**హైదరాబాద్** భారత రాజ్యాంగాన్ని ఆమోదించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బిజెపి తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకలకు కేంద్ర మాజీ మంత్రి, మహారాష్ట్ర మాజీ గవర్నర్ సిహెచ్. విద్యాసాగర్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న బాబా సాహెబ్ అంబేద్కర్ గారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ వేడుకల్లో బిజెపి మాజీ ఎమ్మెల్సీ రాంచందర్ రావు , బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. కాసం వెంకటేశ్వర్లు , బిజెపి ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ , బిజెపి రాష్ట్ర కార్యదర్శులు డాక్టర్ ఎస్.ప్రకాష్ రెడ్డి , మూగ జయశ్రీ , పార్టీ సీనియర్ నాయకులు చింతా సాంబమూర్తి , ఇతర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిహెచ్. విద్యాసాగర్ రావు గారు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 75వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఉత్సాహంగా, ఘనంగా జరుపుకుంటున్నామన్నారు.భారత రాజ్యాంగాన్ని ఆమోదించుకున్న రోజును గుర్తు చేసుకుంటూ ఈ మధ్యే దేశ వ్యాప్తంగా అమృతోత్సవాలు నిర్వహించుకున్నా,రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏళు గడుస్తున్నన్నదన్నారు.రాజ్యాంగం ఆధారంగానే భారతదేశం ఫరిఢవిల్లుతున్నదని ప్రపంచ దేశాలు శ్లాఘిస్తున్నాయని,దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేకూర్చడం కోసం రాజ్యాంగాన్ని ఉపయోగించుకుంటున్నారు, గౌరవిస్తున్నారన్నారు.ప్రపంచంలోనే అతిపెద్ద రాజ్యాంగం మనదని,గతంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా రాజ్యాంగంలో సవరణలు చేసుకున్నామని తెలిపారు.నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అయిన తర్వాత మహారాష్ట్రలో స్కిల్ డెవలప్ మెంట్ కు సంబంధించి ఉత్సాహవంతంగా కార్యక్రమం నిర్వహించారు.భారతదేశంలో అత్యధిక జనాభాతో పాటు అత్యధిక యువశక్తి ఉన్న దేశమిది.

భారతదేశంలో నిక్షిప్తంగా దాగివున్న శ్రమశక్తిని బయటకు తీసేందుకు నైపుణ్య కేంద్రాలను ప్రారంభించాలని పిలుపునిచ్చారు. ఆ దిశలోనే మనం ముందుకెళ్తున్నాం.యావత్ ప్రపంచంలోనే భారత్ అజేయ శక్తిగా ఆవిర్భవించనుంది.రాజ్యాంగబద్ధంగా మన దేశంలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నాం.భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థను రక్షించుకోవడం కోసం, మౌలిక జీవన విలువలను ముందుకు తీసుకెళ్లేందుకు రాజ్యాంగం మార్గం చూపుతుంది.అశోక చక్రంలో, సత్యమేవ జయతే నినాదంలో, త్రివర్ణ పతాకంలోని విలువలను అమలు చేసేలా, భావితరాలకు చాటిచెప్పేలా అందరూ కృషి చేయాలి.ప్రజాస్వామికంగా ఎన్నికైన నాయకులు ఈ విషయంలో శ్రద్ధ చూపించాలన్నారు.

## కార్తీకమాసం 4 వ సోమవారం మల్లన్న క్షేత్రంలో

# లక్షదీపోత్సవం- పుష్కరిణి హారతి







శ్రీశైలం (ప్రశ్న న్యూస్) కార్తిక 4 వ సోమవారం సందర్భంగా పుష్కరిణి వద్ద దేవస్థానం లక్షదీపోత్సం మరియు పుష్కరిణిహారతిని నిర్వహిస్తోంది. లోకకల్యాణం కోసం ఈ కార్యక్రమాలు నిర్వహించారు.

### లక్షదీపోత్సవం:

ఈ దీపోత్సవ కార్యక్రమంలో పుష్కరిణి ప్రాంగణమంతా కూడా దీపాలను ఏర్పాటు చేయడం జరిగింది.
పుష్కరిణి హారతి (దశవిధ హారతులు)ముందుగా శ్రీస్వామిఅమ్మవార్లకు మరియు పుష్కరిణికి దశవిధ హారతులు శాస్త్రోక్తంగా ఇచ్చారు.
కాగా ఈ కార్యక్రమానికి ముందుగా శ్రీస్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పుష్కరిణి వద్దకు వేంచేబు చేయించి విశేషంగా పూజాదికాలు జరిపించారు. అనంతరం శ్రీస్వామిఅమ్మవార్లకు, పుష్కరిణికి దశవిధ హారతులను ఇవ్వడం జరుగుతుంది. అనంతరం ఓంకారహారతి, నాగహారతి, త్రిశూలహారతి, నందిహారతి, సింహహారతి, సూర్యహారతి, చంద్రహారతి, కుంభహారతి, నక్షత్రహారతి, కర్పూరహారతి సమర్పించారు.

### దశహారతులు - దర్శనఫలం

1. **ఓంకారహారతి:** పరబ్రహ్మ స్వరూపమైన బీజాక్షరమే ఓంకారం. ఈ ఓంకారహారతిని దర్శించడం వలన కష్టాలన్నీ నివారించబడతాయి. సకల శుభాలు కలుగుతాయి.

2. **నాగహారతి :** ఈ నాగహారతిని దర్శించడం వలన సర్పదోషాలు తొలగిపోతాయి. సంతానం కలుగుతుంది.

3. **త్రిశూలహారతి :** ఈ త్రిశూలహారతిని దర్శించడం వలన అపమృత్యువు అంటే అకాలమరణం తొలగిపోతుంది. గ్రహదోషాలు నివారించడానికి.

4. **నందిహారతి :** ఈ నందిహారతిని దర్శించడం వలన భయం, దుఃఖము ఉండవు. ఆనందం, ఉత్సాహం లభిస్తాయి.

5. **సింహహారతి :** ఈ సింహహారతిని దర్శించడం వలన శత్రుబాధలు తొలగుతాయి. మనో ధైర్యం కలుగుతుంది.

6. **సూర్య హారతి :** ఈ సూర్య హారతిని దర్శించడం వలన ఆరోగ్యం చేకూరుతుంది. దీర్ఘాయుష్షు లభిస్తుంది.

7. **చంద్రహారతి :** ఈ చంద్రహారతి దర్శించడం వలన మనశ్శుద్ధి కలిగి, ఈర్ష్య, అసూయ ద్వేషాలు తొలగిపోతాయి. మానసిక ప్రశాంతత లభిస్తుంది.

8. **కుంభహారతి :** ఈ కుంభహారతిని దర్శించడం వలన కోరుకున్న కోరికలు నెరవేరుతాయి. సంపదలు కలుగుతాయి.

9. **నక్షత్రహారతి:** ఈ నక్షత్రహారతిని దర్శించడం వలన జాతక దోషాలు తొలగిపోతాయి. చేపట్టిన పనులలో విజయం లభిస్తుంది.

10. **కర్పూరహారతి :** ఈ కర్పూరహారతిని దర్శించడం వలన పాపాలన్నీ తొలగిపోతాయి. యజ్ఞఫలంతో పాటు అష్ట ఐశ్వర్యాలు సిద్ధిస్తాయి.

## శ్రీశైల భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వారిని దర్శించుకున్న హోమ్ మినిస్టర్

**- హోమ్ మినిస్టర్ గారికి స్వాగతం పలికిన జిల్లా ఎస్పీ**



శ్రీశైలం (ప్రశ్న న్యూస్) కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ హోమ్ మినిస్టర్ వంగలపూడి. అనిత " శ్రీశైల భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వారి దర్శనం నిమిత్తం



శ్రీశైలంనకు విచ్చేయడం జరిగింది. ఈ సందర్భంగా హోమ్ మినిస్టర్ శ్రీ భ్రమరాంబిక అతిథిగృహంనకు చేరుకోగానే జిల్లా సాయుధ బలగాల నుండి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జిల్లా ఎస్పీ ఆదిరాజ్ సింగ్ రాణా %అజూం% పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.

## మల్లన్న సన్నిధిలో కార్తీకమాసం చివరి సోమవారం

# సామూహిక కేదారగౌరీవ్రతాలు

**- 1300 మందికి పైగా భక్తులు వ్రతములో పాల్గొన్నారు**

**- గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటిడిఏ) అధికారులు పూర్తి సహాయ సహకారాలను అందజేసారు**





శ్రీశైలం (ప్రశ్న న్యూస్) ధర్మప్రచారంలో భాగంగా ఉచిత కేదారగౌరీవ్రతాలు సామూహిక కేదారగౌరీవ్రతంలో ప్రత్యేకంగా చెంచు గిరిజనులకు అవకాశం రెండు విడతలుగా సామూహిక కేదారగౌరీవ్రతములు సామూహిక కేదారగౌరీవ్రతంలో పాల్గొన్న దాదాపు 1300 మందికి పైగా భక్తులు వ్రతములో పాల్గొన్న వారందరికీ రవికవస్త్రం, వృక్షప్రసాదం, పుస్తక ప్రసాదాల అందజేత వ్రతాన్ని జరిపించుకున్న వారందరికీ శ్రీస్వామిఅమ్మవార్ల దర్శనం మరియు అన్నప్రసాదాల ఏర్పాట్లు. దేవస్థానం కార్తీక నాల్గవ సోమవారమైన ఉచిత కేదారగౌరీ వ్రతాలను నిర్వహించింది. ఆలయప్రాంగణములోని అక్కమహాదేవి అలంకారమండపంలో జరిగిన ఈ కేదారగౌరీవ్రతాలు రెండు విడతలుగా అనగా ఉదయం గం. 7.30లకు మరియు గం. 9.30లకు నిర్వహించడం జరిగింది. ఈ సామూహిక కేదారగౌరీ వ్రతాలకు చెంచు గిరిజన భక్తులను ప్రత్యేకంగా ఆహ్వానించడం జరిగింది. వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 376 మంది చెంచు భక్తులు ఈ వ్రతాన్ని జరిపించుకున్నారు. అదేవిధంగా దాదాపు 960 మంది ఇతరులు కూడా వ్రతాన్ని నిర్వహించుకోవడం జరిగింది. కార్యక్రమములో దేవస్థానం ఉపకార్యనిర్వహణాధికారి ఆర్. రమణమ్మ, సహాయ కమీషనర్ ఈ. చంద్రశేఖరరెడ్డి, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా పలువురు ఐ.టి.డి.ఏ అధికారులు, సిబ్బంది కూడా పాల్గొనడం జరిగింది. కాగా స్థానిక చెంచు గిరిజనులతో పాటు నంద్యాల జిల్లాలోని ఆత్మకూరు, కొత్తపల్లి, బండి ఆత్మకూరు, ఆళ్ళగడ్డ, పల్నాడు జిల్లాలోని మాచర్ల, వెల్దుర్తి, దుర్గి, ప్రకాశం జిల్లాలోని దోర్నాల, చింతల, మర్రిపాలెం, చిలకచెర్లగూడెం, బండంబావి తదితర ప్రాంతాల నుంచి వచ్చిన చెంచు భక్తులు ఈ కార్యక్రమములో పాల్గొన్నారు. చెంచు భక్తులను ఎంపిక చేయడములో స్థానిక గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటిడిఏ) అధికారులు పూర్తి సహాయ సహకారాలను అందజేసారు. వ్రతాలకు కావలసిన పూజాద్రవ్యాలనన్నింటినీ దేవస్థానమే సమకూర్చింది. వ్రతకార్యక్రమంలో పాల్గొనే భక్తుల కోసం వేరు వేరుగా కలశాలను నెలకొల్పి శాస్త్రోక్తంగా ఈ వ్రతం జరిపించబడింది. సంప్రదాయబద్ధంగా జరిగిన ఈ వ్రతంలో ముందుగా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతి పూజ నిర్వహించబడింది. తరువాత వేదికపై వేంచేబు చేయించిన శ్రీస్వామిఅమ్మవార్లకు శాస్త్రోక్తంగా షోడశోపచారపూజలు జరిపించబడ్డాయి. అనంతరం కేదారగౌరీవ్రతంలో భాగంగా భక్తులందరిచేత విడివిడిగా కలశస్థాపన చేయించడం జరిగింది. వ్రతకల్పపూర్వకంగా పూజాదికాలు జరిపించబడ్డాయి. అనంతరం ఆలయ అర్చకులు వ్రతకథను పఠించి వ్రతమహిమా విశేషాలను భక్తులకు తెలియజేశారు. చివరగా నీరాజన మంత్రపుష్పాలను జరిపి వ్రతసమాప్తి చేయబడింది. అదేవిధంగా వ్రతాన్ని జరిపించుకున్న భక్తులకు ప్రసాదాలు, పూలు, గాజులు, రవికవస్త్రం, కంకణాలు (నోముదారాలు)అందజేయబడ్డాయి. అలాగే పుస్తకప్రసాదంగా దేవస్థానం ప్రచురించిన " అష్టోత్తర శతనామకదంబ పుస్తకం"వృక్షప్రసాదంగా ఉసిరి,బిల్వం మొక్కలు అందజేయబడ్డాయి. వ్రతానంతరం వ్రతకర్తలకు శ్రీస్వామిఅమ్మవార్లదర్శనం కల్పించబడింది. దర్శనానంతరం దేవస్థానం అన్నపూర్ణ భవనం నందు భోజన సదుపాయం కూడా కల్పించబడ్డాయి. కాగా భక్తులందరూ వ్రతక్రియను సౌకర్యవంతంగా వీక్షించేందుకు వీలుగా అక్కమహాదేవి అలంకార మండపంలో ఎల్.ఈ.డి స్క్రీనును కూడా ఏర్పాటు చేయడం జరిగింది.

## ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో వాహనాల వేలం



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) మేడ్చల్ ఎక్సైజ్ శాఖ అధికారులు వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలకు మంగళవారం మేడ్చల్ ఎక్సైజ్ శాఖ కార్యాలయ ఆవరణలో వేలం నిర్వహించారు. మేడ్చల్ ఎక్సైజ్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎం. నవనీత రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఫయాజుద్దీన్ ఆధ్వర్యంలో వివిద కేసులలో సీజ్ చేసిన వాహనాల వేలం నిర్వహించినట్లు తెలిపారు. 21 వాహనాలకు వేలం నిర్వహించగా 16 వాహనాలకు వివిధ వ్యక్తులు వేలం పాటలో పాల్గొని కొనుగోలు చేశారు. వాహనాల వేలంలో రూ.5 లక్షల 25 వేల 843లు వచ్చినట్లు సర్కిల్ ఇన్స్పెక్టర్ తెలిపారు. కొనుగోలు చేసిన ప్రతి వాహనానికి 18% జీఎస్టీని చెల్లించినట్లు పేర్కొన్నారు. మిగిలిన వాహనాలకు నిర్ణీత సమయంలో వేలం నిర్వహించబడుతుందని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్లు రాఘవేశ్వర్, వెంకట్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎర్రోల్ల విజయను కలిసిన నాయకులు



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్, సభ్యుల ప్రమాణ స్వీకారం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ ప్రమాణస్వీకారం అనంతరం మార్కెట్ కమిటీ సభ్యురాలుగా ప్రమాణ స్వీకారం చేసిన ఎర్రోల్ల విజయశ్రీనివాస్ దంపతులను వారి నివాసంలో కిష్టాపూర్ గ్రామ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తొంట యాదయ్య, తొంట సుధాకర్, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు తుడం రమేష్ బాబు, తొంట ఆంజనేయులు, తుడుం శ్రీశాంత్ పాల్గొన్నారు.

# వ్యవసాయ అభివృద్దే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం

**- శాసనమండలి ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి**

**- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడితో పాటు సీనియర్ నాయకులు దూరం**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )వ్యవసాయ అభివృద్ధి లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రధాన్యతనిస్తూ కృషి చేస్తుందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్, పాలక వర్గం పదవీ బాధ్యతల స్వీకరణ తో పాటు మేడ్చల్ - మల్కాజ్గిరి జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ భాద్యతల స్వీకరణ కార్యక్రమం మంగళవారం జరిగింది. అనంతరం మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జంగయ్య యాదవ్ అధ్యక్షతన కండ్లకోయలోని ఓ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విశేషంగా కృషి చేస్తున్నారని అన్నారు. మార్కెట్ కమిటీ పాలక వర్గం రైతుల అభివృద్ధి కోసం పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా గ్రంధాలయ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి కు శుభాకాంక్షలు తెలియజేశారు. అంతకుముందు కండ్లకోయలో నూతనంగా నిర్మించిన మార్కెట్ కమిటీ కార్యాలయాన్ని ప్రారంభించారు. కాగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ మల్లిపెద్ది శరత్ చంద్ర రెడ్డి తోపాటు కాంగ్రెస్ పార్టీ మండల మున్సిపల్ ఇన్చార్జిల్ పలువురు ఈ కార్యక్రమానికి దూరంగా ఉండటం చర్చనీయాంశమైంది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గ్రంధాలయం చైర్మన్ డాక్టర్ రియాజ్, తెలంగాణ రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ బంద్రు శోభా రాణి, కుత్బుల్లాపూర్ ఇంచార్జ్ కొలన్ హనుమంత్ రెడ్డి, రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి భూపతి రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సరిత వెంకటేష్, తెలంగాణ రాష్ట్ర హాజ్ కమిటీ మెంబెర్ మహమ్మద్ ముజీబుద్దీన్, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మెన్ బొమ్మలపల్లి నర్సింహా యాదవ్, మేడ్చల్ నియోజకవర్గం ఏ బ్లాక్ అధ్యక్షులు వేణుగోపాల్ రెడ్డి, మేడ్చల్ మున్సిపాలిటీ ఛైర్మెన్ దీపిక నర్సింహా రెడ్డి, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ తోటకూర అజయ యాదవ్, ఘట్కేసర్ మున్సిపాలిటీ చైర్మన్ మల్లి పావని జంగయ్య యాదవ్, జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ శాంతి కోటేష్ గౌడ్, మేడ్చల్ నియోజకవర్గం మండల, మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## రాజ్యంగ ఫలాలు

# ప్రతి ఇంటికి చేరాలి

**హైదరాబాద్** భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ములుగు కేంద్రంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి మంత్రి సీతక్క పూలమాలవేసి నివాళులు అర్పించారు. మంత్రి మాట్లాడుతూ రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు . మన దేశం గొప్ప ప్రజాస్వామ్య దేశంగా మారడానికి ప్రధాన కారణం డా. బిఆర్ అంబేద్కర్, ఆయన రచించిన భారత రాజ్యాంగం. భారత రాజ్యాంగాన్ని, స్పూర్తిని మనం కాపాడుకోవాలి. ప్రతి పల్లె కు, ప్రతి ఇంటికి రాజ్యంగం చేరేలా ప్రచారం జరగాలి.

కుల మతంతో సంబంధం లేకుండా అందరికీ భావ ప్రకటన స్వేచ్ఛ ఇచ్చింది రాజ్యాంగం. అందరికి హక్కులు కల్పించింది మన రాజ్యంగం. అందుకే రాజ్యాంగ గొప్పతనాన్ని అందరం కాపాడుకోవాలి. రాజ్యంగ ఫలాలు ప్రతి గడపకు చేరేలా ప్రచారం చేయాలి. రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ ఐకాన్ ఆఫ్ నాలెడ్జ్. తాను అనుభవించిన కష్టాలు, కన్నీల్లు భవిష్యత్ తరాలకు రావోద్దని అందరికీ హక్కులు కల్పించిన మహనీయుడు డా.అంబేద్కరని అన్నారు. అణగారిన వర్గాలకు రిజర్వేషన్లతో పాటు, అన్ని వర్గాలకు హక్కులు కల్పించింది మన రాజ్యంగం. రాజ్యంగం 75 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు. కొన్ని శక్తులు రాజ్యంగాన్నితుడిచి వేసే ప్రయత్నం చేస్తున్నాయి.

ఆ ప్రయత్నాలను భారతీయులంతా అడ్డుకుని తీరాలి. రాజ్యాంగం లేకపోతే అందరికీ అన్యాయం జరుగుతుంది. రాజ్యంగ దినోత్సవం సందర్భంగా రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రతినభూనుదామని అన్నారు.

# ఇంచార్జ్ ఏసిపిలే దిక్కాయే



## అధికారులు లేకుండా తూతూ మంత్రంగా పాలన

- జిహెచ్ఎంసి పాలనపై ప్రజల ఆగ్రహం
- ప్రభుత్వం మారిన పరిస్థితులు మారకపోవడం విడ్డూరం
- బీఆర్ఎస్ ప్రభుత్వ పరిస్థితి కాంగ్రెస్ ప్రభుత్వం లో అలాగే కొనసాగుతోందా.?
- మార్పు ప్రభుత్వంలో వచ్చింది. అధికారులలో పాలనలో రాకపాయే
- మార్పు పేరుతో గద్దెనెక్కిన కాంగ్రెస్, పాలన ను పక్కన పెట్టిందా.?
- జిహెచ్ఎంసి నే గాడిలో పెట్టలేని ప్రభుత్వం రాష్ట్రాన్ని పెట్టగలదా.?

**(ఆర్ కె - ప్రశ్న న్యూస్ బ్యూరో)**

జిహెచ్ఎంసి లో అధికారులు కరువయ్యారు. ఎక్కడ పడితే అక్కడ సమస్యలు అవినీతి అక్రమాలు వెక్కిరిస్తున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నుండి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వరకు అధికారులు సిబ్బంది పూర్తిస్థాయిలో లేక సేవలను నామమాత్రంగా అందించడం జరుగుతుందన్న ఆరోపణలు ఉన్నాయి. దానికి తగ్గట్టుగానే సికింద్రాబాద్ జోన్ పరిధిలోని సికింద్రాబాద్ సర్కిల్, బేగంపేట సర్కిల్ కు ఏసీపీలు లేక తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు ప్రజలు. ప్రస్తుతం ఇంచార్జ్ ఏసీపీ లతో నెట్టుకొస్తున్నారు తప్ప పూర్తిస్థాయి ఏసీబీలను నియమించకపోవడంతో ఇంచార్జ్ ఏసీపీలు సమస్యలపై అవినీతి అక్రమాలపై దృష్టి సారించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ రెండు సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు తీవ్రంగా జరుగుతున్న ఏసీపీలు లేక ఇన్చార్జి ఏసీపీలో కట్టడి చేయలేక చేతులు ఎత్తేస్తున్నారు. ఇదే అదనుగా చైన్ మెన్ లు న్యాక్ ఇంజనీర్లు అందిన కాడికి దండుకొని లక్షల్లో వస్తువులు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక బేగంపేట సర్కిల్ పరిధిలో ఉన్న చైన్ మెన్ లు పలు యూనియన్ నాయకులుగా ఉండడంతో భారీగా అవినీతి అక్రమాలకు పాల్పడుతూ ఉన్నత అధికారులను సైతం బెదిరిస్తున్నారని దానితో పాటు యూనియన్ నాయకులతో వత్తిడి తెస్తూ ఒకే సర్కిల్ పరిధిలో సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తూ అందిన కాడికి దండుకొని కోట్లు గడిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అక్రమ నిర్మాణదారులతో, బిల్డర్లతో వీళ్లు ఆర్థిక లావాదేవీలు ఏర్పాటు చేసుకొని అక్రమ నిర్మాణాలకు పూర్తిగా సహకరిస్తూ వాళ్లతో మందులు చిందులు వేస్తూ ప్రత్యేక సైన్యాన్ని నడిపించుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. జిహెచ్ఎంసిలో విజిలెన్స్ విభాగం ఉన్న వీటిపై దృష్టి పెట్టేంత అవగాహన లేదు వాళ్లు సైతం వీళ్ళతో చేతులు కారుపారన్న విమర్శలు లేకపోలేదు. అలాగే నార్త్ జోన్ పరిధిలో ఉన్న పలు సర్కిల్లో దాదాపుగా 20 సంవత్సరాల పై బడి ఒకే స్థానంలో విధులు నిర్వహిస్తూ తమ సామ్రాజ్యాన్ని విస్తరించారు చైన్ మెన్ లు. జోనల్ కమిషనర్లను సైతం వీళ్ళు లెక్క చేయరు పూర్తిస్థాయిలో అవినీతికి పాల్పడిన వీళ్లకు నోటీసులు ఇవ్వరు క్రమశిక్షణ కింద చర్యలు తీసుకోరు ఉన్నత అధికారులు.



అందుకోసమే వీళ్ళు ఆడింది ఆటగా పాడింది పాటగా సాగుతోంది పరిస్థితి. ఎందుకంటే వీళ్లకు యూనియన్ నాయకుల సహాయ సహకారాలు పూర్తిగా ఉన్నాయి అదే కాకుండా కొంతమంది యూనియన్ నాయకులుగా ఉండడంతో తము ఆడిందే ఆట పాటిందే పాటగా నడుస్తుందన్న విమర్శలు ఉన్నాయి. ఒకపక్క ఏసీపీలు లేక ఉన్న సెక్షన్ ఆఫీసర్లు సరిగ్గా డ్యూటీ చేయక మొత్తం టౌన్ ప్లానింగ్ వ్యవస్థను చైన్ మెన్ లే నిర్వహిస్తున్నారు. అందుకోసమే ఇంత స్థాయిలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్న ఉన్నత అధికారులకు పట్టింపు లేకపాయే పట్టింపు పక్కన పెట్టిన కనీసం ఉన్నత స్థాయి అధికారులకు అవగాహన లేదనడంలో అతిశయోక్తి లేదు. సాక్షాత్ డిప్యూటీ కమిషనర్లకు, జోనల్ కమిషనర్లకు, సీసీపీకి, జిహెచ్ఎంసి కమిషనర్ కు ఈ చైన్ మెన్ ల వ్యవస్థ అవినీతి అక్రమాలపై కనీస అవగాహన లేదని నగర పౌరులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన పూర్తిస్థాయి ఏసీపి లను నియమించి చైన్ మెన్ ల అవినీతి అక్రమాలను జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్లు, జిహెచ్ఎంసి కమిషనర్ చెక్ పెడతారో లేక చేతులెత్తేస్తారో వేచి చూడాలి.

# అలనాటి బొందలపై

# రాబందువుల ఆగడాలు

- బొందల బంధాలను బరువులతో తుంచిన వైనం
- వాటిక పై బరువుల కొలతలు, ఆయ్మకు తప్పని తిప్పలు
- చితి కాలిన చోట కబ్జాకు తెర లేపిన భస్మాసురులు
- ఈ ఆటలకు పరమాత్ముడే ముగింపు పలకాలి
- బొందల పై ఎవరు బంధువుల వ్యాపారం
- బొందల కంచె తీసి, కనికట్టు చేస్తుంది ఎవరు
- డెబ్బై ఏళ్ళ బొందలు ఆరేళ్ల లో కనుమరుగు,ఇది ఎవరి పాపం
- ఆనవాళ్లు భూగర్భంలో కలిపి, అందరూ పంచుకున్న జాగ
- అమ్ముకొవడానికి జాగ లేదు, టమాటా ట్రెల్ల కోసం 100 చదరపు అడుగుల జాగ దోపిడి
- చట్టం వాళ్ళ చూట్టం, ఎవరికి పట్టదు నియమ నిబంధనలు
- అధికారులకు కళ్ళకు గంతలు, ఆధారం లేనివాడు,
  అందరికి కిరాయి ఇస్తూ వెయ్యిలల్లో వసూళ్లు
- బోయిన్ పల్లి ఏఎంసీలో “44”ల లైసెన్స్ ల దాష్టీకం
- యార్డు అధికారులకు నిత్యం నరకమే, మార్కెట్కి వీళతో అంతా నష్టమే.?
- అడ్డ రూట్లో మాయం, మార్కెట్కి కోట్లల్లో నష్టం






**కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్)** ఆసియాలోనే అతిపెద్ద నెంబర్ వన్ మార్కెట్ యార్డుగా పేరు గాంచిన డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్.”నంబర్ 1”మార్కెట్లో నవవంచక సమస్యలు తాండవం చేస్తున్నాయి.అసలు బోయిన్ పల్లి మార్కెట్ యార్డు కథ ఏమిటి..? బాహ్య ప్రపంచానికి తెలియని విషయాలు ఎన్నో మరెన్నో విషయాలు దాగి ఉన్నాయి.బోయిన్ పల్లి ఏఎంసీలో 2002, డిసెంబర్ 22న”175” మార్కెటింగ్ శాఖ అధికారులు జారీచేసిన విషయం విదితమే. కానీ మార్కెట్లో మరిన్ని నూతన లైసెన్స్ లు జారీ చేయడానికి స్థలం ఉందా లేదా చూసుకోకుండా అప్పటి మార్కెటింగ్ అధికారులు కమిటీ ,రాజకియ నాయకులు వొత్తిడి తో మరో”44”లైసెన్స్ లు జారీ చేసి గందరగోళం నెలకొనడానికి కారణం అయ్యారు.2013 నా కొత్త కమిషన్ ఏజెంట్లు అంటూ తెరమీదకు వచ్చి,పాత వారికి ఇచ్చే వెసులుబాటు మాకు కల్పించాలని లేని పక్షంలో కోర్టు మెట్లు ఎక్కుతామంటూ బెదిరింపులకు దిగడమే కాకుండా న్యాయ స్థానాన్ని ఆశ్రయించారు.ప్రస్తుతం “44”లైసెన్స్ దారులకు మార్కెట్లో గూడు లేదు కదా! అంశం కోర్టులో ఉండడంతో అధికారులు కూడా ఏ నిర్ణయం తీసుకునే పరిస్థితిలో లేకుండా ఉంది.ఇదే అదునుగా కొందరు వ్యవసాయ మార్కెటింగ్ చట్టంలో లొసుగులను ఆధారంగా కోర్టును ఆశ్రయించి “ఇంజెక్షన్ ఆర్డర్”నాట్ టూ ఎంటర్ “ఆర్డర్ కాపీతో చక్కగా మూడు పూవ్వులు ఆరు కాయలుగా వ్యాపారం చేస్తున్నారు.యార్డు అధికారులు ప్రశ్నిస్తే కోర్టు ఆర్డర్ తో కాఫీ తో సమాధానం.ఇలా రెచ్చిపోతున్న సంఖ్య మార్కెట్లో కొక్కోలలు.ఇదో రకమైతే మరొ సరికొత్త ఆలోచనతో దూసుకుపోతున్న “ముసపేట సీ లైన్లో””44” లైసెన్స్ దారుల్లో కొంతమంది ఏకంగా 1967 లో బిసి కులస్థులు, ఎస్సీ కులస్థులకు సంబంధించిన బొందలు “6”ఉన్నాయి.వాటిని గత కొంత కాలంగా “6”ఏళ్లుగా బొందలను నామ రూపం లేకుండా కాలగర్భంతో పాటు భూగర్భంలో సుస్థిరంగా చనిపోయిన వారి బొందల ఆనవాళ్లను కాలగర్భంలో కలిపేశారు.ఇదంతా గత “మార్కెట్ కమిటీ, సెక్రటరీ హయాంలో జరిగిన యధార్థ సంఘటనలు.ఆశ్చర్య పోయే విషయాలు ఏమిటంటే కబ్జా దారులు బొందలపై వ్యాపారం చేయడమే కాకుండా వారి రక్త సంబంధీయులపై బెదిరింపులకు దిగుతున్నట్లు సమాచారం..? సమాజంలో సాధారణంగా ఎవరైనా చనిపోతే వారి సమాధి వద్ద నివాళులు అర్పించడం ఆనవాయితీ.అది దీపావళి రోజున సమాధిని శుభ్రం చేసి వారి ఇంటి మనుష్యులతో కలిసి నమస్కారం చేసుకోవడం వారి హక్కు.ఆ హక్కును నెల రాస్తున్న రాక్షసులు ఎవరు, వీరి పై యార్డు అధికారులు దృష్టి సారించక పొవడం మరిన్ని సమస్యలకు కేంద్ర బిందువు అవుతుంది.ఇక్కడ మరొక విషయం ఏమిటంటే ఒకరిద్దరు తను వ్యాపారం చేసుకోవడమే కాకుండా ఇతరులకు “కిరాయి ఇస్తూ వెయ్యిలల్లో వసూళ్లకు తెర లేపుతున్న పట్టించుకొని సూపర్ వైజర్లు.అదిగాక కొన్ని రోజులుగా బొందలు చివరిన భవన నిర్మాణ వ్యర్థాలు తీసుకుని వచ్చి స్థలాన్ని మరింత వెడల్పు చేస్తున్న యార్డు సిబ్బందికి కానరాదా! లేక కాసుల కక్కుతికి కరచలంతో ముందుకు పోతున్నరా.బోయిన్ మార్కెట్లో ఏదైనా సాధ్యమే అనడానికి కారణం గతంలో మార్కెట్ స్థలం యధేచ్ఛగా కబ్జా చేసిన పట్టించు కోలేదు, ఇప్పుడు “బొందలను బొంద పెడుతున్న అటు వైపు చూడడానికే సాహసించని అధికారులు. కారణం ఏమైయ్యు ఉంటుంది.ఎవరైనా బెదిరింపులకు పాల్పడ్డారా,లేక భయభ్రాంతులకు గురి చేస్తున్నారా అర్థం కాని పరిస్థితిలో మార్కెట్ వర్గాలు. ఇప్పటికైనా మార్కెట్ యార్డు అధికారులు బొందల జాగ పై దృష్టి సారించాలని కొందరు డిమాండ్ చేస్తున్నారు.మరి కొన్ని ప్రజా సంఘాల ప్రతినిధులు వీటి పై చర్యలు తీసుకోకపోతే ఉద్యమంతో సమాధానం చెబుతామని హెచ్చరించారు.”44”తో అన్ని చిక్కులే అనే అధికారులు ఏవిధంగా స్పందిస్తారో చూడాలి.



# 6 గంటల తర్వాత వెళ్లిపోండి

## - ఉద్యోగులకు చంద్రబాబు బంపర్ ఆఫర్



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఏపీలో ప్రభుత్వ ఉద్యోగులకు సీఎం చంద్రబాబు గుడ్ న్యూస్ చెప్పారు. ముఖ్యంగా పని ఒత్తిడిలో పడి కుటుంబాల్ని నిర్లక్ష్యం చేస్తున్న, ఆరోగ్యం పాడు చేసుకుంటున్న ఉద్యోగులకు చంద్రబాబు చెప్పిన న్యూస్ కచ్చితంగా శుభవార్త కాబోతోంది. రాష్ట్రంలో ఉద్యోగులు సాయంత్రం ఆరు గంటల తర్వాత ఆఫీసు వదిలి ఇళ్లకు వెళ్లిపోవాలని సీఎం చంద్రబాబు సలహా ఇచ్చారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా చంద్రబాబు ఉద్యోగులకు ఈ బంపర్ ఆఫర్ ఇచ్చారు. రాష్ట్రంలో ఉద్యోగులంతా స్మార్ట్ వర్క్ చేయాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. ముఖ్యంగా సాయంత్రం 6 గంటల తర్వాత ఆఫీస్‌లో ఉండొద్దని వారికి సూచించారు. అలాగే తాను కూడా 6 గంటలకే సచివాలయం నుంచి వెళ్లిపోతానని వారికి తెలిపారు. ఉద్యోగులు హార్డ్ వర్క్ కాకుండా స్మార్ట్ వర్క్ చేయాలని వారికి చంద్రబాబు సూచించారు. గతంలో ఎక్కువ గంటలు ఆఫీసుల్లో ఉండి పనిచేసే సంస్కృతి ఉండేదని చంద్రబాబు ఉద్యోగులకు గుర్తుచేశారు. ఇప్పుడు అమల్లోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానం వల్ల ఇప్పుడు ఉద్యోగులకు ఎక్కువ సమయం ఆఫీసుల్లోనే ఉండి పనిచేయాల్సిన అవసరం లేదని సీఎం చంద్రబాబు తెలిపారు. కాబట్టి సాయంత్రం 6 గంటల తర్వాత ఎవరూ ఆఫీసుల్లో ఉండొద్దనేది తన విధానంగా వివరించారు. రాష్ట్రంలో సచివాలయ ఉద్యోగులతో పాటు ఏ శాఖలో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులు అయినా ఎక్కువ గంటలు కష్టపడాల్సిన పనిలేదన్నారు. అలాగే స్మార్ట్ వర్క్ ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని కూడా ఉద్యోగులకు సూచించారు. గతంలో ఉద్యోగుల వ్యతిరేకిగా పేరు తెచ్చుకుని అధికారం కోల్పోయిన చంద్రబాబు ఈసారి మాత్రం జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

# ఈవీఎంలు వద్దు..

# బ్యాలెట్ పేపరే కావాలి

- ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లతో ఓటింగ్‌లో అవకతవకలు
- బ్యాలెట్ పేపర్ ఓటింగ్ అవసరంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తాం
- కాంగ్రెస్ పార్టీ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) :** ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లతో ఓటింగ్‌లో అవకతవకలు జరుగుతున్నాయని, వాటికి బదులుగా ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్సే వినియోగించాలని కాంగ్రెస్ పార్టీ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన అభిప్రాయాన్ని వెల్లడించారు. ఈవీఎంలలో ఎలాంటి లోపాలు లేవని, ఈవీఎంలకు వ్యతిరేకంగా వచ్చే ఫిర్యాదులను తాము ఎంటర్‌టైన్ చేయదల్చుకోలేదని కేఏ పాల్ పిటిషన్‌ను కొట్టివేస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన రోజే ఖర్గే ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.‘ఈవీఎంలను పక్కన పెట్టాలంటే మనం అందరం ఒక్కతాటిపైకి రావాల్సిన అవసరం ఉంది. నేను ఎన్నికల గురించి మాట్లాడాలనుకోవడం లేదు. అయితే ఈవీఎంల కారణంగా పేద, బడుగు బలహీన వర్గాల ఓట్లు వృథా అవుతున్నాయి. వాళ్లంతా బ్యాలెట్ పేపర్ ఓటింగ్‌నే కోరుకుంటున్నారు’ అని ఖర్గే చెప్పారు. ఢిల్లీలోని తల్కతోరా స్టేడియంలో జరిగిన సంవిధాన్ రక్షక్ అభియాన్ కార్యక్రమంలో ఖర్గే మాట్లాడారు. ‘ఈవీఎంలు వాళ్ల దగ్గరే పెట్టుకోనివ్వండి. మాకు ఈవీఎంలు వద్దు. మేం బ్యాలెట్ పేపర్‌తో జరిగే ఓటింగ్‌ను కోరుకుంటున్నాం.’ అని ఖర్గే అన్నారు. బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ కోసం రాహుల్‌గాంధీ మరోసారి భారత్ జోడో యాత్ర చేయాలని ఖర్గే కోరారు. బ్యాలెట్ పేపర్ ఓటింగ్ అవసరంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తామని అన్నారు. అందుకోసం ఇతర రాజకీయ పార్టీలతో కూడా మాట్లాడుతామని చెప్పారు.

# నియంతృత్వ పోకడలకు

# రేవంత్ రెడ్డి ప్రభుత్వమే నిదర్శనం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** నియంతృత్వ పోకడలకు తెలంగాణలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వమే నిదర్శనమని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. గిరిజన హాస్టల్లో ఫుడ్ పాయిజన్ కారణంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విద్యార్థిని శైలజ కుటుంబాన్ని పరామర్శించేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కోవా లక్ష్మి, అనిల్ జాదవ్ బయలుదేరారు. అయితే వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ అంశంపై కవిత ఎక్స్ వేదికగా స్పందించారు. రాజ్యాంగ దినోత్సవం రోజునే రాజ్యాంగ హక్కులను రేవంత్ రెడ్డి ప్రభుత్వం నీరుగారుస్తోందని విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి గిరిజన పాఠశాలలో ఫుడ్ పాయిజన్ కావడంతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించిన విద్యార్థిని శైలజ కుటుంబ సభ్యులను ఓదార్చడానికి వెళుతున్న తమ పార్టీ ఎమ్మెల్యేలను అరెస్ట్ చేయడం దురదృష్టకరమన్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588